



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 9 సంచిక : 180 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | శుక్రవారం 6 మార్చి 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE : 180 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | FRI 6 MARCH 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## వెలిగొండకు శంకుస్థాపన చేసింది నేనే..
# పూర్తి చేసి నీళ్లిచ్చేది నేనే

- వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి నేటితో 30 ఏళ్లు పూర్తి
- నాడు ప్రకాశం ప్రజల కష్టాలు చూడలేకే ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టానన్న సీఎం
- ఈ ఏడాది జులై నాటికి తొలి దశ పనులు పూర్తి చేసి కృష్ణా జలాలు అందిస్తాం
- 2027-28 నాటికి వెలిగొండ ఫేజ్-2 పనులు కూడా పూర్తి చేస్తామని వెల్లడి
- గత ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేయకుండానే ప్రారంభోత్సవం చేసిందని విమర్శ



పెన్ పవర్ డెస్క్:వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి నేటితో (మార్చి 5) సరిగ్గా 30 ఏళ్లు పూర్తయ్యింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "వెలిగొండకు శంకుస్థాపన చేసింది నేనే... పూర్తి చేసి నీళ్లు ఇచ్చేది నేనే" అని ఆయన స్పష్టమైన ప్రకటన చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా రైతాంగం చిరకాల వాంఛ అయిన ఈ ప్రాజెక్టు పనుల పురోగతిని, భవిష్యత్ కార్యాచరణను ఆయన ప్రజలతో పంచుకున్నారు. 1996 మార్చి 5వ తేదీ తనకు ఇంకా స్పష్టంగా గుర్తుందని చంద్రబాబు పేర్కొన్నారు. ఆనాడు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతం తీవ్ర కరవు కాటకాలతో, కనీసం తాగడానికి నీళ్లు లేక అల్లాడుతున్న పరిస్థితి ఉందన్నారు. ఆ ప్రజల కష్టాలు తీర్చేందుకు 30 ఏళ్ల క్రితం ముఖ్యమంత్రిగా తానే ఈ ప్రాజెక్టుకు తొలి అడుగు వేశానని గుర్తుచేసుకున్నారు. శ్రీశైలం జలాశయం ఫోర్‌షోర్ నుంచి 43.50 టీఎంసీల నీటిని మళ్లించి... ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 4.38 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరు అందించాలనే బృహత్తర లక్ష్యంతో నాడు వెలిగొండకు భూమిపూజ చేశామని తెలిపారు.అయితే, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి 2014-19 మధ్య తమ ప్రభుత్వ హయాంలో రూ.1,414 కోట్లు ఖర్చు చేసి పనులను వేగవంతం చేశామన్నారు. కానీ, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం అరకొర పనులతో తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, ప్రాజెక్టు పూర్తి కాకుండానే ప్రారంభోత్సవాలంటూ ప్రజలను మోసం చేసి నవ్వులపాలైందని విమర్శించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలిగొండ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చామని చంద్రబాబు తెలిపారు. గతంలో పెండింగ్ ఉన్న రూ.140 కోట్ల బిల్లులను వెంటనే క్లియర్ చేశామని, ప్రాజెక్టు నిర్మాణంపై ఇప్పటివరకు రూ.585 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయని, హెడ్ రెగ్యులేటర్‌కు సంబంధించి 2,200 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్

- మిగతా2లో



## ముగిసిన నితీశ్ శకం..

### బీహార్ తదుపరి ముఖ్యమంత్రి రేసులో ఎవరెవరు ఉన్నారంటే..?

- రాజ్యసభకు నామినేషన్ వేసిన నితీశ్ కుమార్
- బీహార్ సీఎం పదవిని చేపట్టబోతున్న బీజేపీ!
- సీఎం రేసులో సామ్రాట్ చౌదరి, నిత్యానంద రాయ్, దిలీప్ జైస్వాల్

పెన్ పవర్ డెస్క్:బీహార్ రాజకీయాల్లో సుదీర్ఘ కాలం పాటు ముఖ్యమంత్రిగా చక్రం తిప్పిన నితీశ్ కుమా ర్, రాష్ట్ర రాజకీయాల నుంచి తప్పుకుని జాతీయ రాజకీయాల వైపు అడుగులు వేయ డం

- మిగతా2లో



## సీఎం సలహాదారు పదవికి వేం నరేందర్ రెడ్డి రాజీనామా

- రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ వేసిన వేం నరేందర్ రెడ్డి
- నామినేషన్ వేయడానికి ముందు పదవికి రాజీనామా
- నామినేషన్ కార్యక్రమానికి హాజరైన రేవంత్ రెడ్డి

- మిగతా2లో

## సునీల్ నాయక్ ను 7 గంటల పాటు విచారించిన అధికారులు



- హైకోర్టు ఆదేశాల మేరకు విచారణకు హాజరైన సునీల్ నాయక్
- అధికారుల ప్రశ్నలకు పొంతన లేని సమాధానాలు చెప్పినట్టు సమాచారం
- ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగనున్న విచారణ

పెన్ పవర్ డెస్క్:ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై గత ప్రభుత్వ హయాంలో జరిగిన 'కస్టడీ చిత్రహింసల' కేసులో ఐపీఎస్ అధికారి

- మిగతా2లో



# జగన్ జీతం తీసుకోవడం లేదు

- వైసీపీ ఎమ్మెల్యేలు సభకు హాజరు కాకపోవడంపై అయ్యన్నపాత్రుడు అసహనం
- గవర్నర్ ప్రసంగం రోజున సభలో కాసేపు ఉన్నంత మాత్రాన అది పూర్తి హాజరు కాదని వ్యాఖ్య
- వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వడం సాధ్యం కాదన్న స్పీకర్

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు గైర్హాజరవుతుండటంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్రంగా స్పందించారు. ఈరోజు అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల గురించి గళం విప్పుతారని ఓట్లు వేసి గెలిపిస్తే, సభకు రాకుండా పారిపోవడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని మండిపడ్డారు.


- మిగతా2లో

## ఏపీలో జననాల రేటు దారుణంగా పడిపోతోంది

- కుటుంబ నియంత్రణ నుంచి పాపులేషన్ మేనేజ్‌మెంట్ వైపు ఏపీ అడుగులు
- 2047 నాటికి రాష్ట్ర జనాభాలో 23 శాతం వృద్ధులే ఉండే ప్రమాదం
- పిల్లలు లేని వారికి ఐవీఎఫ్ ద్వారా ప్రభుత్వమే సాయం చేస్తుంది
- ముసాయిదా పాలసీపై నెల రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ


పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అత్యంత కీలకమైన 'పాపులేషన్ మేనేజ్‌మెంట్' (జనాభా నిర్వహణ) విధానంపై ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభలో కీలక ప్రకటన చేశారు. దశాబ్దాలుగా అమలులో ఉన్న 'ఫ్యామిలీ ప్లానింగ్' విధానం నుంచి ఇకపై 'పాపులేషన్ కేర్' వైపు దృష్టి సారించాల్సిన

- మిగతా2లో



# ఏపీ అసెంబ్లీలో అస్వస్థతకు గురైన హోంమంత్రి అనిత

- ఏపీ హోంమంత్రి వంగలపూడి అనితకు అస్వస్థత
- అసెంబ్లీ సమావేశాల సమయంలో నలతగా ఉండటంతో ఆసుపత్రికి తరలింపు
- గత వారం రోజులుగా తీరికలేని షెడ్యూలే కారణమని సమాచారం
- ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపిన వ్యక్తిగత సిబ్బంది



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత అస్వస్థతకు గురయ్యారు. నేడు అసెంబ్లీ సమావేశాల సమయంలో ఆమెకు స్వల్పంగా నలతగా అనిపించడంతో, వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఆమెను విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అనితకు రక్తపోటు (బీపీ) పెరిగినట్టు వైద్యులు తెలిపారు. ఉదయం నుంచి అనిత శాసనసభ, శాసనమండలి సమావేశాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ప్రధానంగా తిరుమల లడ్డూ వ్యవహారంపై జరిగిన చర్చలో కూడా ఆమె భాగమయ్యారు. మండలి సమావేశాలు వాయిదా పడిన తర్వాత, అసెంబ్లీ కొనసాగుతున్న సమయంలో ఆమె అస్వస్థతకు లోనయ్యారు. దీంతో వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించారు.గత వారం రోజులుగా అసెంబ్లీ సమావేశాలు,

- మిగతా2లో

## జగన్ హయాంలో నిజాలను తొక్కిపెట్టే ప్రయత్నం జరిగింది

- ఏపీ శాసనమండలిలో తిరుమల లడ్డూ అంశంపై చర్చ సందర్భంగా గందరగోళం
- చైర్మన్ పోడియంను చుట్టుముట్టి నినాదాలు చేసిన వైసీపీ సభ్యులు
- సభను వాయిదా వేసిన మండలి చైర్మన్

- మిగతా2లో



# ఒక యుద్ధం.. 14 దేశాలు ఆగం



- మండుతున్న పర్షియన్ గల్ఫ్
- అమెరికా బేస్ క్యాంపులే లక్ష్యం
- ఇరాన్ డ్రోన్, క్షిపణి దాడులు
- అజార్ బైజన్ ఎయిర్ పోర్టుపై దాడి
- అమెరికా ఆధీనంలోని నక్చివాన్ టార్గెట్
- దాడి అమెరికా ఆధీనంలోని నక్చివాన్ టార్గెట్

**పెన్ పవర్ డెస్క్:** ఇరాన్,-ఇజ్రాయిల్- అమెరికా యుద్ధం విస్తరిస్తోంది. పర్షియన్ గల్ఫ్ లో ని యెమన్ మినహా అన్ని దేశాల్లో ఉద్రిక్త పరిస్థితు లు నెలకొన్నాయి. ప్రస్తుతం ఇజ్రాయిల్, సౌదీ అరేబియా, యూఏఈ, బహ్రెయిన్, ఖతార్, కువైట్, టర్కీ, ఇరాక్, ఒమన్, అజార్ బైజాన్ పై ముమ్మరంగా డ్రోన్లు, క్షిపణులతో ఇరాన్ దాడులు చేస్తోంది. ప్రత్యేక ప్రాంతంగా గుర్తించిన నక్చివాన్ పైనా ఇవాళ దాడులు జరిగాయి. ఇరాక్ రాజధాని బాగ్దాద్ అంతర్జాతీయ వి మానాశ్రయం దగ్గర ఉన్న అమెరికా సైనిక స్థావరంపైనా దాడి జరిగింది. ఖతార్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపిన ప్రకారం, దేశంలోని వాయు రక్షణ వ్యవస్థలు ఒక మిస్సైల్ దాడిని అడ్డుకున్నాయి. దోహా పై ఆకాశంలో అనేక పేలుళ్లు జరిగాయి. సౌదీ అరేబియా రక్షణ శాఖ వివరాల ప్రకారం.. ఒక డ్రోన్ దాడికి ఇరాన్ యత్నించగా.. అల్ జెఫ్ ప్రాంతం దగ్గరధ్వంసమైంది. టర్కీ గగన తలంలోకి వచ్చిన బాలిస్టిక్ మిస్సైల్ ను నాటో దళాలు నిర్వీర్యం చేశాయి. దీనిపై ఇరాన్ సైన్యం స్పందించింది. తాము టర్కీ భూభాగాన్ని టార్గెట్ చేయలేదని స్పష్టం చేసింది. ఒమన్ లోని ఆయిల్ మార్కె టింగ్ కంపెనీకి

- మిగతా2లో



## యుద్ధంతో సమస్యలు పరిష్కారం కావు

- ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు
- చర్చలు, దౌత్యంతోనే సమస్యలకు పరిష్కారం అని ఉద్ఘాటన
- ఉగ్రవాద నిర్మూలనే ఇరువురి ఉమ్మడి లక్ష్యం అని ప్రకటన
- వలసలు, మొబిలిటీపై భారత్, ఫిన్లాండ్ కీలక ఒప్పందం
- విద్యా రంగంలో పరస్పర సహకారానికి నిర్ణయం

2లో



## అలా చేస్తే ఇజ్రాయెల్ అణు ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకుంటాం

- ఆరు రోజులుగా ఇజ్రాయెల్, అమెరికా-ఇరాన్ మధ్య భీకర యుద్ధం
- ఇరాన్‌లో పాలకులు మారే వరకు యుద్ధం కొనసాగుతుందన్న ఇజ్రాయెల్
- పాలనను మార్చాలని చూస్తే అణు ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరిక

2లో

# ఎడిటర్ వ్యూ

## హోర్ముజ్ మూసివేతతో ప్రపంచం కుదేలైందా?

హోర్ముజ్ సముద్ర మార్గం (జల సంధి) ప్రపంచంలో అతి ముఖ్యమైన జలమార్గాల్లో ఒకటి. ఇరాన్ ఉత్తర భాగంలో, ఒమన్ దక్షిణ భాగంలో ఉంది. పర్షియా గల్ఫ్‌ను ఒమన్ గల్ఫ్, అరేబియా సముద్రంతో కలిపే ఇరుకైన మార్గం.అత్యంత ఇరుకైన చోట కేవలం 33 కిలోమీటర్ల వెడల్పు మాత్రమే ఉంది. ఇది ఒక చిన్న మార్గం కావడం వల్లే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు 'గొంతు' లాంటిది. ఏ చిన్న అడ్డంకి వచ్చినా ప్రపంచ చమురు ధరలు ఆకాశాన్నంటుతాయి.. ఇప్పుడు జరుగుతున్న అమెరికా-ఇజ్రాయెల్ దాడుల తర్వాత మార్చి 2న ఈ మార్గం మూసివేస్తున్నామని ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. ఏ ఓడ ఈ మార్గం నుండి వెళ్లినా దాడి చేస్తామని హెచ్చరించింది. ఫలితం.. వాణిజ్య ఓడలు ఆగిపోయాయి. పెద్ద షిప్పింగ్ కంపెనీలు రవాణా ఆపేశాయి. ట్యాంకర్లు దాదాపు జీరోకి తగ్గాయి. కొన్ని ట్యాంకర్లపై దాడులు జరిగి 5కి పైగా ఓడలు దెబ్బ తిన్నాయి. 150కి పైగా ఓడలు ఆగిపోయాయి. హోర్మోజ్ జల సంధి వాస్తవంగా మూసివేయబడింది. ప్రతి రోజూ సుమారు 20 మిలియన్ బ్యారెల్స్ ముడి చమురు, ఇతర ఇంధనాలు ఈ మార్గం గుండా ప్రపంచానికి వెళ్తాయి. ఇది ప్రపంచ మొత్తం చమురు వినియోగంలో సుమారు 20 శాతానికి సమానం. సముద్ర మార్గంలో వచ్చే చమురులో 25-30 శాతం ఇక్కడి నుంచే వస్తుంది. ద్రవ గ్యాస్ (ఎల్ఎన్‌జీ)లో కూడా సుమారు 20 శాతం ఈ మార్గం గుండా వెళుతుంది. గల్ఫ్ దేశాలు - సౌదీ అరేబియా, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, ఖతార్, ఇరాన్ - వీటి చమురు ఎగుమతులు దాదాపు అన్నీ ఇక్కడి గుండానే వెళ్తాయి. ఆసియా దేశాలు ఎక్కువగా ఈ మార్గంపై ఆధారపడతాయి. చైనా అత్యధికం, ఆ తర్వాత భారత్, జపాన్, దక్షిణ కొరియా. ఈ మార్గం ద్వారా వెళ్లే చమురులో 84 శాతం ఆసియాకు వెళ్తుంది. ఇరాన్ ఉత్తర భాగాన్ని నియంత్రిస్తుంది కాబట్టి దాడి చేసి లేదా హెచ్చరించి మార్గాన్ని నియంత్రించగలదు. ఇది ఇరాన్‌కు పెద్ద వ్యూహాత్మక ఆయుధం. గతంలో కూడా ఇరాన్ ఇలాంటి హెచ్చరికలు చేసింది. కానీ ఈసారి అమలు చేసింది. దీని వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన దెబ్బ తగులుతోంది. చమురు ధరలు ఇప్పటికే 7 నుంచి 13 శాతం పెరిగాయి. వి100కి చేరే అవకాశం ఉంది.

మన దేశం 85-90 శాతం చమురు విదేశాల నుంచి తీసుకుంటుంది. అందులో సగం కంటే ఎక్కువ (సుమారు 50 శాతం) ఈ మార్గం గుండా వస్తుంది. రోజుకు 1.5 నుంచి 2.7 మిలియన్ బ్యారెల్స్. ఇరాక్, సౌదీ అరేబియా, యుఏఈ, కువైట్ నుంచి వచ్చే నూనె దాదాపు అన్నీ ఇక్కడి గుండానే.. దీంతో పాటు వంట గ్యాస్ (ఎల్‌పీజీ)లో 85 శాతం, ద్రవ గ్యాస్ (ఎల్ఎన్‌జీ)లో 55 శాతం ఈ మార్గం గుండా వస్తాయి.. ఈ మార్గం మూసివేత కొనసాగితే మన చమురు స్టాక్ కేవలం 40-45 రోజులకు సరిపోతుంది. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు భారంగా పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెరిగి సామాన్యుల జీవన ఖర్చు ఎక్కువవుతుంది. రూపాయి విలువ తగ్గుతుంది. వాణిజ్య లోటు పెరుగు తుంది. ఇది కేవలం చమురు సమస్యే కాదు. ఎగుమతులు ఆలస్యమవుతాయి. షిప్పింగ్ ఖర్చులు పెరుగుతాయి. గల్ఫ్‌లో పని చేసే 90 లక్షల మంది మనవాళ్ల భద్రత, సంపాదన ప్రమాదంలో పడతాయి. దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థపై భారీ ఒత్తిడి పడుతుంది.

ఇరాన్‌కు ఇది ఏకైక ఆయుధం. అణు శక్తి, సైనిక బలం తక్కువైనా ఈ మార్గంతో ప్రపంచాన్ని బెదిరించగలదు. అమెరికా నావల్ ఫోర్సెస్ ట్యాంకర్లను రక్షించడానికి సిద్ధమవుతున్నాయి కానీ పరిస్థితి ఇంకా ప్రమాదకరంగా ఉంది. ఇలాంటి చోక్‌పాయింట్లు (ఇరుకైన మార్గాలు) ఎంత బలహీనమైన దేశానికైనా పెద్ద శక్తిని ఇస్తాయని ఇది నిరూపిస్తోంది. అందుకే భారత్ తక్షణం రష్యా నుంచి చమురు ఎక్కువ దిగుమతి చేసుకోవడం ఒక ప్రత్యామ్నాయం. మన వ్యూహాత్మక చమురు నిల్వలను (రాఖభీ) ఉపయోగించాలి. దీర్ఘకాలంలో చమురు దిగుమతులను వైవిధ్య పరచాలి. సౌర శక్తి, గాలి శక్తి వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలపై ఎక్కువ దృష్టి పెట్టాలి.. ఇరాన్ యుద్ధం మనకు ఒక పెద్ద హెచ్చరిక - ఎనర్జీ భద్రతను స్వయం సమృద్ధిగా మార్చుకోవాలి. హోర్ముజ్ సముద్ర మార్గం మూసివేత ప్రపంచానికి పెద్ద సంక్షోభం తెచ్చింది. భారత్ వంటి దేశాలు ఇంధన ధరల పెరుగుదలతో ఆర్థికంగా దెబ్బతింటున్నాయి. ఇరాన్ యుద్ధం ఎక్కువ కాలం కొనసాగితే మూడో ప్రపంచ యుద్ధం అంచుకు వచ్చే ప్రమాదం ఉంది. అందుకే ఐక్య రాజ్యసమితి ద్వారా తక్షణం సంభాషణలు జరిపి యుద్ధాన్ని ఆపాలి. ఈ మార్గం తెరవాలి. యుద్ధం కొనసాగితే ప్రపంచమంతా నష్టపోతుంది. శాంతి, సంభాషణలు, దౌత్యం ద్వారా మాత్రమే ఈ సంక్షోభాన్ని అధిగమించాలి. భారత్ ఈ విషయంలో నాయకత్వం వహించాలి!

# జగన్ జీతం తీసుకోవడం లేదు

- మొదటి పేజి తరువాయి
సభకు హాజరుకాకుండా కేవలం బయట ఉంటూ జీతభత్యాలు తీసుకోవడం నైతికంగా సరికాదని అన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలంతా జీతాలు తీసుకుంటున్నారని, ఆ పార్టీ అధినేత జగన్ మాత్రం జీతం తీసుకోవడం లేదని చెప్పారు.కేవలం గవర్నర్ ప్రసంగం రోజున వచ్చి కాసేపు నిరసన తెలిపి వెళ్లినంత మాత్రాన అది పూర్తిస్థాయి హాజరు అనిపించుకోదని స్పీకర్ స్పష్టం చేశారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం వరుసగా 65 రోజుల పాటు సభకు అనుమతి లేకుండా గైర్హాజరైతే ఆ సభ్యులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని, వారికి నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే ప్రజా ప్రతినిధులను 'రీకాల్' చేసే హక్కు ప్రజలకు ఉండాలని, దీనిపై చట్ట సవరణలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమస్య కేవలం ఏపీకే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా చట్టసభల గౌరవాన్ని కాపాడటానికి లోక్‌సభ స్పీకర్‌ను కలిసి చర్చిస్తానని తెలిపారు.
ప్రస్తుతం అసెంబ్లీలో ప్రతి ఎమ్మెల్యే సీటు వద్ద ఏర్పాటు చేసిన ఏఐ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా సభ్యుల హాజరును కచ్చితంగా నమోదు చేస్తున్నామని, దీని ద్వారా ఎవరు ఎంతసేపు సభలో ఉన్నారో రికార్డు అవుతుందని స్పీకర్ వివరించారు. నిబంధనల ప్రకారం కనీసం 10 శాతం సీట్లు (18 మంది ఎమ్మెల్యేలు) ఉన్న పార్టీకి మాత్రమే ప్రతిపక్ష హోదా లభిస్తుందని, కేవలం 11 సీట్లు ఉన్న వైసీపీకి ఆ హోదా ఇవ్వడం సాధ్యం కాదని అయ్యన్న పాత్రుడు మరోసారి తేల్చిచెప్పారు.

## సీఎం సలహాదారు పదవికి వేం నరేందర్ రెడ్డి రాజీనామా

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి రాజ్యసభ రేసులోకి రావడంతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. రాజ్యసభ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ఆయన పేరును ఖరారు చేయడంతో, సాంకేతిక కారణాల దృష్ట్యా ఆయన తన ప్రభుత్వ సలహాదారు పదవికి రాజీనామా చేశారు. రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎలాంటి 'లాభదాయక పదవుల్లో' ఉండకూడదనే నిబంధన ఉండటంతో, నామినేషన్ దాఖలుకు ముందే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. వేం నరేందర్‌రెడ్డి రాజీనామాను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆమోదించారు.
రాజీనామా ప్రక్రియ ముగిసిన వెంటనే, వేం నరేందర్‌రెడ్డి మరో కాంగ్రెస్ అభ్యర్థి, ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో కలిసి అసెంబ్లీలో తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు ఆయన వెంట ఉన్నారు. తెలంగాణ నుంచి ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలకు కాంగ్రెస్ ఈ ఇద్దరినీ బరిలోకి దింపింది. అసెంబ్లీలో ఉన్న సంఖ్యాబలం దృష్ట్యా ఈ రెండు స్థానాలను కాంగ్రెస్ ఏకగ్రీవంగా దక్కించుకునే అవకాశం ఉంది.

## జగన్ హయాంలో నిజాలను తొక్కిపెట్టే ప్రయత్నం జరిగింది

ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో తిరుమల లడ్డూ కల్తీ అంశంపై ఈరోజు జరిగిన చర్చ సందర్భంగా తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ సున్నితమైన అంశంపై దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రభుత్వం తరఫున ప్రకటన చేసేందుకు సిద్ధమవగా, ప్రతిపక్ష వైసీపీ సభ్యులు తీవ్రస్థాయిలో అడ్డు తగిలారు.
తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందనే విషయం దర్యాప్తు సంస్థల నివేదికల్లో స్పష్టంగా ఉందని, అప్పటి ప్రభుత్వం నిబంధనలను తుంగలో తొక్కి తమకు అనుకూలమైన వారికి టెండర్లు కట్టబెట్టిందని మంత్రి ఆనం ఆరోపించారు. జగన్ హయాంలో నిజాలను తొక్కిపెట్టే ప్రయత్నం జరిగిందని, నాటి టీటీడీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి కూడా కొన్ని విషయాలను అంగీకరించారని ఆయన గుర్తు చేశారు. వాస్తవాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని అన్నారు.
మంత్రి మాట్లాడుతున్న సమయంలోనే వైసీపీ సభ్యులు చైర్మన్ పోడియంను
చుట్టుముట్టి నినాదాలు చేశారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం పెరగడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. మండలి చైర్మన్ మోషేను రాజు సభ్యులను శాంతింపజేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడంతో, చివరకు సభను రేపటికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

## యుద్ధంతో సమస్యలు పరిష్కారం కావు

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ మరోసారి శాంతి మంత్రం జపించింది. కేవలం సైనిక చర్యలతో ఏ సమస్యా పరిష్కారం కాదని, చర్చలు, దౌత్యమే సరైన మార్గమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. గురువారం నాడు ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం ఇరువురు నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో నెలకొన్న ఘర్షణలను ముగించేందుకు జరిగే ప్రతి ప్రయత్నానికి భారత్ మద్దతు ఇస్తుందని మోదీ హామీ ఇచ్చారు. చట్టం, న్యాయం, ప్రజాస్వామ్య విలువలపై భారత్, ఫిన్లాండ్‌లకు ఒకే రకమైన అభిప్రాయం ఉందని ఆయన తెలిపారు.
ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరమని ఇరువురు నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ నిర్మూలించడమే తమ ఉమ్మడి లక్ష్యమని మోదీ పేర్కొన్నారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ 'ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్' పూర్తి చేయడాన్ని ప్రస్తావిస్తూ మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మీరు ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్ పూర్తి చేశారు.. మీలాంటి శక్తివంతమైన నాయకత్వంతో భారత్, ఫిన్లాండ్ కూడా ఇన్నోవేషన్, డిజిటల్, సస్టైనబిలిటీ అనే కొత్త 'ట్రయాథ్లాన్'ను సాధిస్తాయని నాకు నమ్మకం ఉంది" అని మోదీ చమత్కరించారు.

**కొత్త శకంలో భారత్-యూరప్ బంధం**

ప్రస్తుతం ప్రపంచం అస్థిరత, అనిశ్చితి మధ్య ఉందని, ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచంలోని రెండు పెద్ద దౌత్య శక్తులైన భారత్, యూరప్ మధ్య సంబంధాలు స్వర్ణయుగంలోకి ప్రవేశిస్తున్నాయని ఆయన అభివర్ణించారు. 2026 ప్రారంభంలో కుదిరిన చారిత్రాత్మక 'ఇండియా-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' గురించి ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ఒప్పందం ద్వారా భారత్, ఫిన్లాండ్ మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక సహకారం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**కీలక ఒప్పందాలపై సంతకాలు**

ఇరు దేశాల మధ్య ఆవిష్కరణల వ్యవస్థను అనుసంధానించేందుకు సమగ్ర 'మైగ్రేషన్ అండ్ మొబిలిటీ' (వలసలు మరియు రాకపోకల) ఒప్పందంపై సంతకాలు చేసినట్లు ప్రధాని ప్రకటించారు. భారతీయ విద్యార్థులకు, ప్రతిభావంతులకు ఫిన్లాండ్ ఇప్పుడు ఒక ప్రాధాన్య గమ్యస్థానంగా మారుతోందన్నారు. ఈ ఒప్పందం వల్ల ఇరు దేశాల మధ్య పరిశోధనలు, స్టార్టప్ సహకారం మరింత బలపడుతుందని తెలిపారు. విద్యా రంగంలో ఫిన్లాండ్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడిన మోదీ.. ఉపాధ్యాయ శిక్షణ, స్కూల్-టు-స్కూల్ భాగస్వామ్యం, భవిష్యత్ విద్యా విధానాలపై సహకారాన్ని విస్తరించుకోవడానికి అంగీకరించినట్లు వెల్లడించారు. నార్డిక్ ప్రాంతంలో ఫిన్లాండ్ భారత్‌కు ముఖ్యమైన భాగస్వామి అని, ఆర్కిటిక్, ధృవ ప్రాంతాల పరిశోధనల్లోనూ తమ సహకారం కొనసాగుతుందని మోదీ స్పష్టం చేశారు.

## వెలిగొండకు శంకుస్థాపన చేసింది నేనే..
# పూర్తి చేసి నీళ్లిచ్చేది నేనే

- మొదటి పేజి తరువాయి
పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. అలాగే రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ పనులు చురుగ్గా సాగుతున్నాయని పేర్కొన్నారు.
రైతుల కలను సాకారం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని, ఈ ఏడాది (2026) జులై నాటికి వెలిగొండ తొలి దశ (ఫేజ్-1) పనులు పూర్తి చేసి కృష్ణా జలాలను తీసుకొస్తామని సీఎం హామీ ఇచ్చారు. అలాగే 2027-28 నాటికి ఫేజ్-2 నిర్మాణం కూడా పూర్తి చేస్తామన్నారు.
కరవు ప్రాంతంలో ప్రతి ఎకరానికి నీళ్లిచ్చి, హార్టికల్చర్ సాగును ప్రోత్సహించి రైతన్నల జీవితాల్లో వెలుగులు నింపుతామని చంద్రబాబు స్పష్టం చేశారు.

# ముగిసిన నితీశ్ శకం..

- మొదటి పేజి తరువాయి
ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాం శమైంది. రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన నేపథ్యంలో ఆయన త్వరలోనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నారు. ఈ నేపథ్యంలో, బీహార్ తదుపరి ముఖ్యమంత్రి ఎవరనే చర్చ పెద్ద ఎత్తున జరుగుతోంది.ప్రస్తుత అంచనాల ప్రకారం, కొత్త ప్రభుత్వంలో బీజేపీ ముఖ్యమంత్రి పదవిని దక్కించుకోనుంది. ఈ రేసులో ప్రధానంగా ముగ్గురు నేతల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వారు ఎవరంటే...? సామ్రాట్ చౌదరి: ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సామ్రాట్ చౌదరి సీఎం రేసులో అందరికంటే ముందున్నారు. ఓబీసీ (కుష్వాహా) సామాజికవర్గానికి చెందిన ఆయనకు పార్టీలో, ప్రభుత్వంలో పట్టు ఉండటం ప్లస్ పాయింట్. నిత్యానంద రాయ్: కేంద్ర మంత్రిగా ఉన్న నిత్యానంద రాయ్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. యాదవ సామాజికవర్గానికి చెందిన ఈయనను సీఎంగా చేయడం ద్వారా,
ఆర్జేడీ (తేజస్వి యాదవ్) ఓటు బ్యాంకుకు గండి కొట్టాలని బీజేపీ భావిస్తోంది. అమిత్ షాతో నిత్యానంద రాయ్ కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దిలీప్ జైశ్వాల్: బీహార్ మంత్రి దిలీప్ జైశ్వాల్ పేరు కూడా పరిశీలనలో ఉంది. వైశ్య సామాజికవర్గానికి చెందిన ఈయనకు పార్టీ అధిష్ఠానం వద్ద మంచి గుర్తింపు ఉంది.

## ఏపీ అసెంబ్లీలో అస్వస్థతకు గురైన హోంమంత్రి అనిత

- మొదటి పేజి తరువాయి
వరుస కార్యక్రమాలతో హోంమంత్రి తీరిక లేకుండా గడుపుతున్నారు. నిరంతర పని ఒత్తిడి, సరైన విశ్రాంతి లేకపోవడం వల్లే ఆమె నీరసించిపోయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.హోంమంత్రి ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె వ్యక్తిగత సిబ్బంది స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని, విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని వైద్యులు సూచించినట్లు సమాచారం. అంతా సవ్యంగా ఉంటే ఈ రోజు సాయంత్రానికే ఆమె ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

### ఒక యుద్ధం.. 14 దేశాలు ఆగం

- మొదటి పేజి తరువాయి
చెందిన ఒక స్టోరేజ్ ట్యాంక్వచ్చిన బాలిస్టిక్ మిస్సైల్ ను నాటో దళాలు నిర్వీర్యం చేశాయి. దీనిపై ఇరాన్ సైన్యం స్పందించింది. తాము టర్కీ భూభాగాన్ని టార్గెట్ చేయలేదని నాశనం చేసింది. ఒమన్ లోని ఆయిల్ మార్కె టింగ్ కంపెనీకి చెందిన ఒక స్టోరేజ్ ట్యాంక్ తెలిపింది. తుర్కీ అధ్యక్షుడు రెసెప్ తాయిప్ ఎర్రోగాన్ మాట్లాడుతూ "అలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా నాటో మద్దతు తీసుకుంటు న్నట్లు తెలిపారు. అటు ఇరాన్ కు మద్దతుగా లెబనాన్ సైతం దాడులకు దిగుతోంది. హిజ్బు ల్లా సంస్థ కూడా ఇరాన్ కు మద్దతు పలికింది.

## సునీల్ నాయక్ ను 7 గంటల పాటు విచారించిన అధికారులు

- మొదటి పేజి తరువాయి
సునీల్ నాయక్ తొలిరోజు విచారణ ముగిసింది. ఈరోజు ఉదయం ప్రారంభమైన ఈ విచారణ, విజయనగరం ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలో గుంటూరులోని సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో దాదాపు 7 గంటల పాటు సుదీర్ఘంగా సాగింది. హైకోర్టు ఆదేశాల మేరకు విచారణకు హాజరైన సునీల్ నాయక్, అధికారుల ప్రశ్నలకు పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది.రఘురామకృష్ణరాజును సీఐడీ కస్టడీలో ఉంచిన ఆ రాత్రి, సునీల్ నాయక్ పలుమార్లు ఆ కార్యాలయానికి వెళ్లినట్లు దర్యాప్తులో తేలింది. దీనిపై అధికారులు ప్రశ్నించగా, ఆయన కేవలం అరకొర సమాధానాలతోనే సరిపెట్టినట్లు సమాచారం. సీఐడీ కార్యాలయంలో ఆ రాత్రి జరిగిన పరిణామాలు, ఎవరి ఆదేశాల మేరకు ఆయన అక్కడికి వెళ్లారు అనే కోణంలో పోలీసులు లోతుగా విచారిస్తున్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం మార్చి 5 నుంచి 9వ తేదీ వరకు ఈ విచారణ కొనసాగాల్సి ఉంది. అంటే, మరో నాలుగు రోజుల పాటు ఆయన పోలీసుల ఎదుట హాజరుకావాల్సి ఉంటుంది. రాబోయే నాలుగు రోజుల్లో ఆయన ఎలాంటి వాంగ్మూలం ఇస్తారో, ఈ కేసులో ఇంకెవరి పేర్లు బయటకు వస్తాయో వేచి చూడాలి.

## అలా చేస్తే ఇజ్రాయెల్ అణు ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకుంటాం

తమ దేశంలో పాలన మార్పునకు ప్రయత్నిస్తే ఇజ్రాయెల్‌లోని డిమోనా అణు ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ అమెరికాను హెచ్చరించింది. పశ్చిమాసియాలో అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య గత ఆరు రోజులుగా భీకర యుద్ధం సాగుతోంది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడిలో మృతి చెందారు. ఖమేనీ మృతి చెందిన తర్వాత యుద్ధం మరింత ఉద్ధృతంగా మారింది.ఇజ్రాయెల్, అమెరికా తమ లక్ష్యాలను చేరుకున్నాయని, ఈ నేపథ్యంలో ట్రంప్ ఎప్పుడైనా యుద్ధాన్ని ఆపివేయవచ్చని వార్తలు వచ్చాయి. దీనిపై స్పందించిన ఇజ్రాయెల్ అధికారి ఇరాన్‌లో పాలకులు మారే వరకు యుద్ధం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పాలకులను మార్చుతామంటూ ఇజ్రాయెల్ చేసిన ప్రకటనపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది.తమ దేశంలో పాలనను మార్చే ప్రయత్నం చేస్తే ఇజ్రాయెల్‌లోని అణు ప్లాంటును లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరికలు జారీ చేసింది. అంతేకాకుండా పశ్చిమాసియాలో చమురు మౌలిక సదుపాయాలను తమ క్షిపణులు లక్ష్యంగా చేసుకుంటాయని పేర్కొంది.

## ఏపీలో జననాల రేటు దారుణంగా పడిపోతోంది

- మొదటి పేజి తరువాయి
ఆవశ్యకత ఏర్పడిందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు సిద్ధం చేసిన ముసాయిదా పాలసీని సభలో ప్రవేశపెట్టారు.రాష్ట్రంలో జననాల రేటు (టోటల్ ఫెర్టిలిటీ రేట్ - టీఎఫ్ఆర్) ఆందోళనకరంగా పడిపోతోందని ముఖ్యమంత్రి గణాంకాలతో సహా వివరించారు. 1993లో 3.0గా ఉన్న ఫెర్టిలిటీ రేటు ప్రస్తుతం 1.5కు పడిపోయిందని తెలిపారు. జపాన్, దక్షిణ కొరియా, ఇటలీ వంటి దేశాల్లో ఏర్పడిన క్లిష్ట పరిస్థితులే ఇప్పుడు ఏపీలోనూ కనిపిస్తున్నాయన్నారు. జననాల రేటు ఇలాగే వేగంగా తగ్గిపోతే భవిష్యత్తులో పనిచేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయి, ఆర్థిక వృద్ధి మందగించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇద్దరు పిల్లల కంటే తక్కువ ఉన్నవారికి రాజకీయ ప్రాతినిధ్యం దక్కదేమో అని వ్యాఖ్యానించారు. ఈ విషయంలో ప్రభుత్వం ఇప్పుడు జోక్యం చేసుకోకపోతే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు.ప్రస్తుత గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ఏటా 6.70 లక్షల జననాలు నమోదవుతున్నాయని, ఈ ధోరణి ఇలాగే కొనసాగితే 2047 నాటికి మన జనాభాలో 23 శాతం మంది వృద్ధులే ఉంటారని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే పాపులేషన్ మేనేజ్‌మెంట్ కోసం 'ఐదు అంచెల లైఫ్ సైకిల్' విధానాన్ని తెరపైకి తెచ్చినట్లు వెల్లడించారు. మాతృత్వం, శక్తి, క్షేమం, నైపుణ్యం, సంజీవని అనే ఐదు పిల్లర్ల ద్వారా మహిళ గర్భధారణ నుంచి వృద్ధాప్యం వరకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.మహిళల లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్ ప్రస్తుతం 31 శాతంగా ఉందని, దీనిని 59 శాతానికి పెంచగలిగితే రాష్ట్ర జీఎస్‌డీపీ 15 శాతానికి చేరుతుందని అంచనా వేశారు. సంతానోత్పత్తి సమస్యలతో బాధపడే దంపతులను ఆదుకునేందుకు 'మాతృత్వ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయనున్నట్లు సీఎం తెలిపారు. ఇందులో భాగంగా పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్ షిప్) పద్ధతిలో తక్కువ ఖర్చుతో లేదా సబ్సిడీపై ఐవీఎఫ్ సేవలు అందించే ఆలోచనలో ఉన్నామన్నారు. అలాగే అనవసర సిజేరియన్ ఆపరేషన్లను తగ్గించడం, ప్రస్తుతం 8.8 శాతంగా ఉన్న టీనేజ్ గర్భధారణలను 3 శాతం కంటే తక్కువకు తీసుకురావడం ఈ పాలసీ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.
ఈ ముసాయిదా పాలసీని ప్రజల ముందు ఉంచుతున్నామని, దీనిపై రాబోయే నెల రోజుల పాటు విస్తృత చర్చ జరగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అందరి అభిప్రాయాలు స్వీకరించిన తర్వాతే దీనికి తుది రూపం ఇస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఆదిత్య యూనివర్సిటీ మెకానికల్ విద్యార్థులు పరిశ్రమల సందర్శన






**గండేపల్లి,పెన్ పవర్,మార్చి5:**ఆదిత్య విశ్వవిద్యాలయం, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన రెండవ సంవత్సరం విద్యార్థులకు పరిశ్రమల సందర్శనలో భాగంగా విశాఖపట్నంలో వున్న స్టీల్ ప్లాంట్ ను సందర్శించడం జరిగింది అని యూనివర్సిటీ డిప్యూటీ ప్రో - ఛాన్సలర్ డాక్టర్ ఎం శ్రీనివాస రెడ్డి తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో మొత్తం 65 మంది విద్యార్థులు తో పాటు యూనివర్సిటీ పాలనాధికారులు డాక్టర్ సందీప్ కునార్ , డి .గోపాల కృష్ణ, కుమారి వై .పుష్ప లత పాల్గొన్నారు. ఈ పరిశ్రమ సందర్శన ద్వారా విద్యార్థులు ఆధునిక సాంకేతిక విజ్ఞానం మరియు పరిశ్రమల కార్యకలాపాలపై ప్రత్యక్ష అవగాహన పొందారు. అలాగే విద్యార్థులు పరిశ్రమల తయారీ ప్రక్రియలు, యంత్రం పని విధానం, నాణ్యత నియంత్రణ విధానాలపై ప్రాక్టికల్ జ్ఞానం సంపాదించారు. ఈ సందర్శన విద్యార్థులకు భవిష్యత్తులో ఉపాధి అవకాశాలకు దోహదపడుతుందని అధ్యాపకులు తెలిపారు. ఈ పర్యటన విజయవంతమగుటకు సహకరించిన అందరికి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.డి వి వి ఎస్ .భీమేశ్వర రెడ్డి అభినందనలు తెలియజేశారు.




## కాకినాడ సెజ్ భూములు రైతులకు తిరిగి అప్పగింపు







- అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ షణ్మోహన్


**కాకినాడ, మార్చి 05, పెన్ పవర్:**కాకినాడ జిల్లాలో సెజ్‌కు చెందిన భూములను తిరిగి రైతుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేసి వారికి అప్పగించే ప్రక్రియ కొనసాగుతున్నదని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.
గురువారం కాకినాడ కలెక్టర్ కార్యా లయంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్‌తో కలిసి రెవెన్యూ, సెజ్, రిజిస్ట్రేషన్ తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కాకినాడ రూరల్,యు.కొత్తపల్లి, తొండంగి మండలాల పరిధిలోని భూములను గతంలో సెజ్ పరిధిలోకి తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ భూములను అర్హత గల రైతుల పేర్లపై తిరిగి రిజిస్ట్రేషన్ చేయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలపై రాష్ట్ర ప్రభుత్వం స్టాంప్ డ్యూటీ మరియు రిజిస్ట్రేషన్ ఫీజులను పూర్తిగా మినహాయింపు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అందువల్ల రైతులు ఈ అవకాశాన్ని వినియోగించు కుని తమ భూములను తిరిగి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు, దస్తావేజులు, ప్రభుత్వం నిర్వహించిన రీ-సర్వే నోటీసుల వివరాలు మార్చి 13వ తేదీ లోపు సంబంధిత మండలాల తహశీల్దార్ కార్యాలయాల్లో సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. సెజ్ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు రెవెన్యూ, సెజ్, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రైతుల పేర్లపై భూముల బదిలీ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ తిప్పేనాయక్, కాకినాడ మరియు పెద్దాపురం ఆర్డీవోలు ఎస్. మల్లిబాబు, ఎన్. శ్రీధర్, జిల్లా రిజిస్ట్రార్ కె. ప్రసాద్ రావు,కాకినాడ రూరల్, తొండంగి, యు.కొత్తపల్లి మండలాల తహశీల్దార్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా సిద్ది బుద్ది సమేత యువ గణపతి స్వామి వారి కళ్యాణం



**అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 5:** స్థానిక పంచాయతీ వీధిలో వేంచేసియున్న శ్రీ సిద్ధి బుద్ధి సమేత యువ గణపతి స్వామి వారి కళ్యాణం గురువారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ పురోహితులు కొడమంచిలి వెంకటకృష్ణ నాగేశ్వర శర్మ ఫణి కుమార్ శర్మ ఆధ్వర్యంలో తాళం రామకృష్ణ గోపి లక్ష్మి దంపతుల చే సిద్ధి, బుద్ధి సమేత యువగణపతి స్వామివారి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులకు దాతల సహకారంతో ఆలయ కమిటి సభ్యులు బహుమతులు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణం తిలకించి స్వామివారి ఆశీస్సులు పొందారు

## రామానందస్వామిజీ, సాదు సుబ్బరాజు విగ్రహాల ఆవిష్కరణ...



**పెన్ పవర్, మార్చి 5:**అమలాపురం రూరల్ మండలం వన్నెచింతలపూడి గ్రామంలో గాయత్రీ శక్తి పీఠంలో గురువులు సాధు సుబ్బరాజు, రామానందస్వామి పంచలోహ విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా గురువారం విగ్రహదాత కుంటుంబ సంభ్యులు, సాధుసుబ్బరాజు, రామానందస్వామి విగ్రహాలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, మండప ఆరాధన, అష్టోత్తర కలశ స్థాపనం, నీరాజనం, మంత్రపుష్పలు, గురుమూర్తుల విగ్రహాలకు గణపతి విగ్రహాలకు జలాభిషేకం, క్షీరాభిషేకం, హోమ, గురుమాల, మూల మంత్ర హోమములు, కళా హోమములు, లక్ష్మి గణపతి హోమం, నీరాజనం, మంత్రపుష్పలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రామానందస్వామిజీ శిష్య, భక్త బృందం, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ లో ఘనంగా అంతర్జాతీయ మహిళ దినోత్సవం.







**ఏలేశ్వరం, పెన్ పవర్, మార్చి 5:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మహిళా దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాడు ఐసిడిఎస్ సిడిపిఓ పద్మావతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమము చేపట్టారు.
మహిళల, బాలికల హక్కులు సమానత్వం సాధికారిత న్యాయ అవగాహనపై 20 రోజుల కార్యక్రమంలో భాగంగా చేపట్టిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ముఖ్యంగా ప్రస్తుత సమాజంలో మహిళలు తెలుసుకోవలసిన విషయాలపై అవగాహన కల్పించారు. విద్య, న్యాయస్థానము, చట్టం ఆరోగ్యం తదితర అంశాలపై విద్యార్థులు మహిళలకు ఆయా శాఖల అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడలలో నైపుణ్యం కలిగిన విద్యార్థులకు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వివిధ రంగాలలో విధులు నిర్వహిస్తున్న మహిళామణులను ఐసిడిఎస్ సిడిపిఓ పద్మావతి మహిళా దినోత్సవ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పద్మావతి, డాక్టర్ సౌభాగ్య మాట్లాడుతూ ముందుగా మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బాల్య దశలో చైల్డ్ మ్యారేజ్ లకు ఎవరూ ప్రోత్సహించరాదని సూచించారు. మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని కోరారు. విద్యార్థి దశ నుంచే సమాజాన్ని చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి, లక్ష్మణరావు ప్రముఖ న్యాయవాది బుగతా శివ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రయాగమూర్తి ప్రగడ, మహిళ హెడ్ కానిస్టేబుల్ గాయత్రి, డాక్టర్ సౌభాగ్య సరోజ, ఎంఈఓ వరలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్వైజర్ సూర్య కుమారి, కళాశాల వైస్ ప్రిన్సిపల్,మెప్మా మేనేజర్ ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది ఐ సి డి ఎస్ సిబ్బంది, పలువురు విద్యార్థినీ విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.





## వీరవరం మర్లావ తారు రోడ్డుపనులకు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ తోట రవి.



**-రూ.49 లక్షలు నిధులతో రోడ్డు పనుకు శంకుస్థాపన.**

**కిర్లంపూడి, పెన్ పవర్, మార్చి 05**: కిర్లంపూడి మండలం వీరవరం నుండి మర్లావ గ్రామానికి వెళ్లే పుంత రోడ్డును రూ.49 లక్షల వ్యయంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో తారు రోడ్డుగా అభివృద్ధి చేయడానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి ఎంపీపీ తోట రవి,వీరవరం సొసైటీ చైర్మన్ తోట గాంధీ,మర్లావ గ్రామ సర్పంచ్ తోట రామకృష్ణ పాల్గొని తారురోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ తోట రవి,తోట గాంధీ మాట్లాడుతూ వీరవరంమర్లావ గ్రామాలను కలిపే ఈ పుంత రహదారి చాలా కాలంగా దెబ్బతిని ఉండటంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ తారు రోడ్డును నిర్మించడం ద్వారా పరిసర గ్రామాల ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగు పడటంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా కూడా సులభతరమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీరవరం గ్రామ టిడిపి అధ్యక్షులు గొల్లపల్లి సూరిబాబు,కాతా పెద్దరాయుడు, యాళ్ల రాంబాబు,యామన వెంకటేశ్వరావు తదితర నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## పల్లెలో భక్తి ప్రవాహం పళ్ళాలమ్మ తల్లి హుండీలో నాలుగు నెలల్లో రూ.3.95 లక్షలు



**కొత్తపేట, పెన్ పవర్, మార్చి 05:**వానపల్లి గ్రామంలో వెలసియున్న శ్రీ శ్రీ శ్రీ పళ్ళాలమ్మ తల్లి అమ్మవారి దేవస్థానంలో బుధవారం హుండీ లెక్కింపు కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించబడింది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఎంతో ప్రసిద్ధి చెందిన, పిలిచిన వెంటనే పలికే చల్లని తల్లిగా పేరుగాంచిన అమ్మవారి హుండీని నాలుగు నెలల 18 రోజుల అనంతరం లెక్కించగా మొత్తం రూ.3,95,570 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు. పలివెలకు చెందిన ఈవో పి. కామేశ్వరరావు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు చేపట్టగా,ఆలయ దేవస్థానం ఈవో భాగవతుల వెంకట రమణమూర్తి వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మద్దింశెట్టి ఆదినారాయణ,ధర్మకర్తల మండలి సభ్యులు,గ్రామ సర్పంచ్ పల్లి భీమారావు, నూకల వీరన్న, బండారు పేర్రాజు,వక్కపట్ల నాగేశ్వరరావు,మేడిది వెంకటేశ్వరరావు,అప్పారి శ్రీను, గనిశెట్టి వెంకట్రావు,కంచుస్తంభం రామకృష్ణ, నల్ల రాంబాబు,సిద్ధబత్తుల బహదుర్ తదితర గ్రామ పెద్దలు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. భక్తులు సమర్పించిన కానుకలతో వచ్చిన ఈ ఆదాయం ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల మెరుగుదలకు వినియోగించనున్నట్లు ఈవోలు తెలిపారు.

## సమస్యల పరిష్కారం కోరిన గ్రామ సర్వేయర్లు

ఆత్రేయపురం తహసిల్దార్, ఎంపీడీవో , వినతి పత్రం





**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 5:**ఆత్రేయపురం: ఆత్రేయపురం మండలంలోని గ్రామ సర్వేయర్లు తమ సమస్యల పరిష్కారానికై గురువారం ఆత్రేయపురం తహసిల్దార్, ఎంపీడీవో , మండల సర్వేయర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సర్వేయర్లకు ఇవ్వాల్సిన ప్రమోషన్లు వెంటనే కల్పించాలని, మెరుగైన బేసిక్ పే అమలు చేయాలని, అలాగే తమకు సకాలంలో టి.ఏడి.ఏ బిల్లులు చెల్లించాలని కోరారు. ఈ సమస్యలను పరిష్కరించకపోతే మార్చి 5, 2026 నుండి రీ సర్వే మరియు స్వామిత్వ సర్వే కార్యక్రమాలకు సహాయ నిరాకరణ చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ హేమంత్ సాయి, గ్రామ సర్వేయర్ మండల అధ్యక్షుడు బాబా మహేశ్వర్ రెడ్డి మండలంలోని గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

## మండల స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం




**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 5 :**ఆత్రేయపురం మండలం ర్యాలి రామకృష్ణ జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు ప్రతిభ మూడవ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో ర్యాలి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి మండల స్థాయిలో బహుమతులు సాధించారు. వ్యాసరచన పోటీలో విపత్తి నవీన్ కుమార్ ప్రథమ స్థానం సాధించగా, వ్యక్తిత్వ వికాసం పోటీలో పి. జగదీశ్వరి ద్వితీయ స్థానం పొందింది. పద్యపఠనం పోటీలో వి. జాహ్నవి ద్వితీయ స్థానం సాధించింది. అలాగే వ్యాసరచనలో జి. యామిని ద్వితీయ స్థానం దక్కించుకుంది.వారి ప్రతిభను గుర్తిస్తూ గురువారం ర్యాలి జడ్పీ హైస్కూల్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మిషన్ శక్తి కార్యక్రమంలో మహిళల ఆరోగ్యంపై అవగాహన




**కాకినాడ, పెన్ పవర్ మార్చి 5:**అంతర్జాతీయ మహిళా దినోత్సవం2026 సందర్భంగా నిర్వహిస్తున్న మిషన్ శక్తి 20 రోజుల కార్యక్రమంలో భాగంగా స్థానిక సంజయనగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ లో గురువారం మహిళల ఆరోగ్యం, సురక్షిత మాతృత్వం, బాలికల సంక్షేమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

మార్చి 2 నుండి మార్చి 20 వరకు కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా దుమ్ములపేట సెక్టార్ సూపర్వైజర్ దయామణి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో గర్భధారణకు ముందు మరియు గర్భధారణ సమయంలో లింగ నిర్ధారణను నిషేధించే చట్టం, కిశోర బాలురుబాలికల ఆరోగ్యం, సురక్షిత మాతృత్వం, అలాగే ప్రధాన్ మంత్రి మాతృ వందన యోజన పథకం గురించి అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.ఏ. దేవి మాట్లాడుతూ చేతుల పరిశుభ్రత ప్రాముఖ్యత, యూరినరీ ట్రాక్ ఇన్ఫెక్షన్లు, లింగ నిర్ధారణ నిషేధం, గర్భిణీలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, అలాగే టీనేజ్ గర్భధారణ వల్ల కలిగే సమస్యలపై వివరించారు.

హెల్త్ విజిటర్ అరుణ టీనేజ్ గర్భధారణ వల్ల కలిగే ఆరోగ్యపరమైన, సామాజిక సమస్యలను వివరించి యువతికి జాగ్రత్తలు సూచించారు. అనంతరం ఏఎన్ఎం సునీత సురక్షిత మాతృత్వం, గర్భిణీలకు అవసరమైన టీకాల ప్రాధాన్యతపై వివరంగా తెలియజేశారు.

ఈ అవగాహన కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, తల్లులు, కిశోరి బాలికల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం 20 రోజుల ప్రణాళికలో అవగాహన కార్యక్రమాలు







**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 5 :** మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన 20 రోజుల ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా ఆత్రేయపురం మండలంలోని పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం పేరవరం జెడ్‌పీహెచ్ స్కూల్, మెర్లపాలెం జెడ్‌పీహెచ్ స్కూల్‌లలో బాలికలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రాముఖ్యత, కిశోర వయస్సులో ఆరోగ్య సంరక్షణ, లైంగిక , ప్రజనన ఆరోగ్యంపై బాలికలకు వివరించారు. బాల్య దశలోనే ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమని అధికారులు సూచించారు.కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్వైజర్లు కె. పద్మావతి, వై. అరుణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొని బాలికలకు పలు సూచనలు చేశారు.మహిళా దినోత్సవం నేపథ్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాల ద్వారా బాలికల్లో చట్టాలపై అవగాహన పెరగడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై చైతన్యం కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

## వైభవంగా ముగిసిన శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఎనిమిదివ వార్షికోత్సవాలు. -ఆలయం వద్ద భారీ అన్నదానం.





**కిర్లంపూడి, పెన్ పవర్, మార్చి 05:** మండల కేంద్రమైన కిర్లంపూడిలో వేంచేయున్న శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఎనిమిదో కళ్యాణ వార్షికోత్సవ వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా ముగిసాయి. స్వామివారి ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ అన్నదాన కార్యక్రమానికి కిర్లంపూడి, చిల్లంగి, జగపతినగరంతోపాటు చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదములు స్వీకరించారు.ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, జగపతినగరం మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, ఆలయ కమిటీ సభ్యుల మాట్లాడుతూ స్వామివారి కళ్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు, ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమానికి సహకరించిన భక్తులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు పాముల వీరబాబు, శరకణం భద్రం. వేగి రామకృష్ణ, పెంటకోట శ్రీరాములు, మళ్ల నాగు, నక్కా అప్పలరాజు, శరకణం తాతాజీ, పాముల చంటి, గౌతు చిన్న, యల్లపు నానాజీ,బొడ్డేటి గణపతి, లంక మూర్తి,నైదాన బాబ్జి,సంగన వెంకటేశ్వరరావు, మద్దాల రాంబాబు, కాళ్ళ పొలారావు పలువురు కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఆలమూరులో పుంతలో ముసలమ్మ జాతర ఉత్సవాలు ప్రారంభం.



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 05;**మండల కేంద్రమైన ఆలమూరులో వేంచేసి ఉన్న గ్రామ దేవత పుంతలోముసలమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక సిద్ధార్థ స్కూల్ రోడ్లో కొలువై ఉన్న అమ్మవారి ఆలయం వద్ద గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం జాతర ఉత్సవాలను మొదలుపెట్టారు. అమ్మవారిని వివిధ చర్మ వాయిద్యాలతో నాగ దుర్గ గరగనృత్య కళాకారులచే గరగనత్యాలు, గారడి నృత్యలతో గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. పుంతలో ముసలమ్మ అమ్మవారికి భక్తులు పసుపు కుంకుమలతో స్వాగతం పలికే అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలమూరు పుంతలో ముసలమ్మ ఆలయం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఊరేగింపు కార్యక్రమంలో యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈనెల 8వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని ఎనిమిదో తేదీ ఆదివారం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలు సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

## నేర రహిత సమాజం పల్లె నిద్ర లక్ష్యం.

-జగ్గంపేట,సి ఐ, వై ఆర్ కె శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్సై జి సతీష్.



**కిర్లంపూడి, పెన్ పవర్, మార్చి 05:**గ్రామాల్లో నేర రహిత సమాజం పల్లె నిద్ర లక్ష్యమని జగ్గంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్,వై ఆర్ కె శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్సై,జి సతీష్ అన్నారు. జిల్లా ఎస్పీ,జి బిందుమాధవ్ ఆదేశాల మేరకు కిర్లంపూడి మండలం పాలెం గ్రామంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులకు, యువతకు, మహిళలకు చట్టపరమైన అంశాలను తెలియజేశారు. హెల్మెట్ ధరించి రోడ్డు ప్రమాదాలు నివారించాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించడమే కాకుండా, మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. ఇంట్లో ఎవరూ లేనప్పుడు పగలైనా, రాత్రయినా విలువైన బంగారు ఆభరణాలు, నగదు ఉంచరాదని హితవు పలికారు. చైన్ స్నాచర్లు ఒంటరి మహిళలనే టార్గెట్ చేస్తున్నారని మహిళలు బస్సుల్లోనూ, ఆటోల్లోనూ ప్రయాణించేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యువత గంజాయిలాంటి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని వాటి వల్ల వచ్చే అనర్థాలను యువతకు వివరించారు. బాల్య వివాహాలను చేయవద్దని సూచించారు. అలాగే సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పలువురు గ్రామస్తులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ సత్తెమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలి. -ప్రత్తిపాడు వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు





**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్ 05:**శ్రీ సత్తెమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. గురువారం ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామంలో వేంచేసియున్న శ్రీ సత్తెమ్మ తల్లి ఆలయాన్ని ముద్రగడ గిరిబాబు సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని,అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఇంటిపైనా ఉండాలని, అందరికీ ఆయురారోగ్యాలు సిద్ధించాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామిశెట్టి నాని,ఎంపిటిసి సాధానాల అప్పారావు, మాజీ సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు, రామకుర్తి రవిబాబు, సూరారపు ఏసుబాబు,ములికి వీరాస్వామి కొప్పన నాయుడు, కొప్పన రాంబాబు, గోపు వీరభద్రరావు పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు వక్కలంక బుల్లియ్య మృతి

**అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 5.** టీడీపీ సీనియర్ నాయకులు ఎన్టీఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు వక్కలంక వీరభద్ర శర్మ (బుల్లియ్య) మృతికి ఖుటమి నాయకులు ఘన నివాళు లర్పించారు. ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి, పార్టీ జెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ నామన రాంబాబు టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు డొక్కా నాథ్ బాబు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, గణపతి వీరఘవులు, గిడ్డి ఆనంద్, అరిగెల బలరామూర్తి, నాగాబత్తుల వెంకట సుబ్బారావు, దువ్వూరి సురేష్, జల్లి బాలరాజు, రవణం రాము దంతులూరి శ్రీనురాజు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ మట్టపర్తి భారతి, కెవివి సత్యనారాయణ, గుమ్మడి వెంకటేశ్వరావు, మోకా శ్రీను, బట్టు బంగారం నేదునూరి రాజకుమార్ జంగా ప్రసాద్ కత్తుల బాలరాజు యాళ్ల సత్యనారాయణ సత్యాల కొండలరావు నేదునూరి శేఖర్ పెట్టా కిషోర్ తదితరులు ఉన్నారు.




02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఏడాదిలోపే కాయలు కాసి అబ్బుర పరుస్తున్న పనస మొక్క



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 05;** సాధారణంగా పనస మొక్క నాటిన నాలుగైదు ఏళ్లకు చెట్టుగా మారి అప్పుడు కొమ్మల మొదళ్లలో కాయలు రావడం సహజం. అయితే ఆలమూరు మండలం గుమ్మిలేరులో ఏడాది లోపు పనసమొక్కకు పనసకాయ కాయడం అబ్బురపరుస్తుంది. గుమ్మిలేరుకు చెందిన పుంగనూరు ఆవుల పోషకులుగా పేరుగాంచిన రెడ్డి సత్తిబాబు తన పశువుల మకాం వద్ద గత ఏడాది జూలైలో బుర్రిలంక వద్ద నర్సరీ నుంచి పనసమొక్క కొనుగోలు చేసి తెచ్చి నాటారు. అయితే నెలల వ్యవధి లోనే మొక్కకు పనసకాయ కాయడంతో ఆశ్చర్యపోవడం రైతు రెడ్డి సత్తిబాబు వంతయ్యింది. దీనిపై కొత్తపేట ఉద్యానవనశాఖ అధికారి కోటేశ్వరరావును వివరణ కోరగా విత్తనాల ద్వారా వచ్చిన పనస మొక్క 6 నుంచి 8ఏళ్లకు కాపుకు వస్తుందని, అంటుకట్టిన మొక్క అయితే నాలుగైదు ఏళ్లకు కాపుకాస్తుందని, గుమ్లెస్ జాక్ అనే వెరైటీ త్వరగా కాపుకు వస్తుందని తెలిపారు. ఈ మొక్క ఆ తరహా జాతికి చెందినదన్నారు.

## నేడు జనార్ధనస్వామివారి హుండీ లెక్కింపు.




**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 05;** నారద ప్రతిష్టిత నవ జనార్ధన ఆలయాల్లో ప్రముఖమైన ఆలమూరు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామివారి ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నేడు నిర్వహించనున్నారు. ఈవో నరేంద్ర కుమార్, ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం 2.30గం.లకు స్వామి వారి హుండీని తెరిచి భక్తులు, గ్రామ పెద్దల సమక్షంలో లెక్కించనున్నట్లు పాలకమండలి సభ్యులు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## జిల్లా వ్యాప్తంగా ముమ్మర వాహన తనిఖీలు....



- ★ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు..
- ★ జిల్లా ఎస్పీ శ్రీ రాహుల్ మీనా.

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 5:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపిఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా గురువారం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ముమ్మర వాహన తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని ఎస్.హెచ్.ఓలు మరియు పోలీస్ సిబ్బంది ప్రధాన కూడళ్లలో తనిఖీలు చేపట్టి, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకున్నారు.

## 'పది' పరీక్షల్లో అప్రమత్తంగా వ్యవహరించండి...



సీఎస్,డీవోల సమావేశంలో డీఈవో నాగేశ్వరరావు.

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 5:** ఈ నెల 16వ తేది నుంచి ప్రారంభం కానున్న పది పబ్లిక్ పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు ప్రతి క్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.నాగేశ్వరరావు పిలుపు నిచ్చారు. మండలంలోని ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాల సమావేశపు హాలులో గురువారం జిల్లా వ్యాప్తంగా నియమించబడిన సీఎస్, డీవో, ఏడీవోల సమావేశం ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.హనుమంతురావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో సీఎస్, డీవో, ఏడీవోలనుద్దేశించి డీఈవో నాగేశ్వరరావు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడా, ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేని విధంగా పరీక్షలు నిర్వహించాలన్నారు. సమిష్టి కృషితో సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రణాళిక ప్రకారం కృషి చేయాలన్నారను. ఎక్కడా మాల్ ప్రాక్టీస్కు అవకాశం లేకుండా పరీక్షలను నిర్వహించడం ద్వారా జిల్లాకు రాష్ట్ర స్థాయిలో మంచి పేరు తీసుకుని రావాలన్నారు. సమావేశంలో పరీక్షల విభాగం ఏసీ బి.హనుమంతరావు మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి జరిగే పది పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పరీక్ష పేపర్లు జిల్లా కేంద్రం నుంచి పోలీస్టేషన్లకు పంపిస్తామన్నారు. పరీక్ష పేపర్లు విద్యార్థులకు అందజేసే సమయంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ అధికారులు ఒకటికి రెండు సార్లు సరిచూసువాలన్నారు. జిల్లాలో 108 పరీక్షా కేంద్రాల్లో 19,630 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. 219 మంది సీఎస్,డీవో,ఏడీవోలను నియమించినట్లు తెలిపారు. సమావేశంలో డీవైఈవోలు జి.సూర్యప్రకాష్, పి.రామలక్ష్మణమూర్తి, కడలి వెంకటేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారులు, డీఈవో కార్యాలయ ఏఎస్వో డి.తాతారావు, ఎస్ఎస్సీ ఎగ్జామినేషన్స్ అసిస్టెంట్ మాచిరాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి




**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 5:** స్త్రీలు మరియు పురుషులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సీడీపీఓ ఎం.పూర్ణిమ అన్నారు. జగ్గంపేట మండలం కాండ్రేగుల జడ్పీహెచ్ఎస్ స్కూల్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కిషోరి బాలలు, బాలికలు, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, స్కూల్ ఉపాధ్యాయులుకు అవగాహన కల్పించారు. సీడీపీఓ పూర్ణిమ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి కాట్రావులపల్లి పిహెచ్సి డాక్టర్ అయేషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీసీ పి ఎన్ డి టి యాక్ట్ చట్టం యొక్క ప్రధాన లక్ష్యం ఆడ శిశువు హత్య నివారించడమన్నారు. సమాజంలో పిల్లల లింగ సమతుల్యత కాపాడడం ప్రవేట్ ఆసుపత్రిలో స్కానింగ్ సెంటర్లు, అల్ట్రాసౌండ్ సెంటర్ లు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయుంచాలన్నారు. గర్భిణీస్త్రీకి లింగం చెప్పడం లేదా అడగడం నేరమని డాక్టర్ లేదా స్కాన్ సెంటర్ చట్టాన్ని ఉల్లంగిస్తే లైసెన్స్ రద్దు అవుతుందని 3 సంవత్సరాలు జైలు శిక్ష, 10వేలు జరిమానా విధిస్తారన్నారు. బాలికలు నెలసరి సమయంలో శుభ్రమైన ప్యాడ్స్ ఉపయోగించాలన్నారు. పాలు, గుడ్లు, పండ్లు, కూరగాయలు వంటి పోషకహారం తీసుకోవాలని రక్త హీనత రాకుండా ఐరన్ ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. 14 సంవత్సరాలు నిండిన బాలికలు హెచ్ పి వి వ్యాక్సిన్ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం సూపరవైజర్ సునీత, తల్లులు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందజేత



**కాట్రేనికోన పెన్ పవర్ మార్చి 5:**
ఇటీవల కిమ్స్ హాస్పిటల్ ప్రాంగణంలో జరిగిన 3వ ప్రపంచ తెలుగు మహాసభలలో జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, సాపేవారిపల్లి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి కిమ్స్ యాజమాన్యం వారు స్వయంగా పాఠశాలకు విచ్చేసి నగదు ప్రోత్సాహకంతో పాటు ప్రతిభా ప్రశంసా పత్రాలను అందజేశారు. జూనియర్ విభాగంలో వ్యాసరచన పోటీలో కాశి ఆశ్రీత,వక్తృత్వంలో పలివెల మహాలక్ష్మి, అదేవిధంగా సీనియర్ విభాగంలో వక్తృత్వం పోటీలలో గనిశెట్టి కీర్తి స్వరూప లక్ష్మి బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల మొదటి సహోపాధ్యాయులు ఎన్.ఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ ఇటువంటి పోటీలలో పాల్గొనే విధంగా చేసినటువంటి కిమ్స్ యాజమాన్యానికి మరియు విద్యార్థుల గైడ్ టీచర్ కొల్లి బేబీ మరియు బి.దుర్గాభవానిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని పాఠశాలకు మరియు గ్రామానికి పేరు తీసుకు వచ్చిన విద్యార్థులందరినీ అభినందించారు. అదేవిధంగా పాఠశాల నుండి మరొక ఐదుగురు కూడా పాల్గొని ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ సిబ్బంది బాలనాగు, బాబి, ఉపాధ్యాయులు గెడ్డం ప్రదీప్, ఎం. శ్రీనివాసరాజు, వై.కృష్ణ, చెల్లి దీపిక, సిహెచ్ జ్యోతి, ఎం. సౌమ్య సుజని విద్యార్థులు పాల్గొన్నారు.

## కొబ్బరి నూనె వ్యాపారి నాగప్రసాద్ మృతి



**అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 5:** గత కొంతకాలంగా అనారోగ్యంతో బి బదపడుతున్న ప్రముఖ కొబ్బరినూనె వ్యాపారి అప్పన నాగప్రసాదు (76). మృతి చెందారు. అంబాజీపేటలో కొబ్బరి, కొబ్బరి నూనె వ్యాపారంలో రాణించారు. భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి ది కోనసీమ కోకోనట్ ఆయిల్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పేరా బత్తుల సాయి కృష్ణ, కాసు నాగేంద్ర లతోపాటు కూటమి నాయకులు నాగప్రసాద్ మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు.

## ర్యాలిలో ఆలయ అభివృద్ధి పనులకు ముహూర్తం





**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 5** :ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ జగన్మోహిని కేశవ స్వామి, గోపాల స్వామి వారి దేవస్థానంలో రాజగోపురం నిర్మాణానికి గురువారం ముహూర్తం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆలయం ముందు ఉన్న భవనాన్ని తొలగించే కార్యక్రమాన్నివేదమంత్రోచ్చారణల మధ్య ప్రారంభించారు. అలాగే ర్యాలి గ్రామంలోని శ్రీ వాగ్దేవి నగర మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ఉన్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ పునఃనిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టారు. ఆలయ పునఃనిర్మాణ పనుల నిమిత్తం బాలాలయ నిర్మాణానికి గురువారం ముహూర్తం నిర్వహించారు. ఈ కార్యక్రమాలు జగన్మోహిని కేశవ స్వామి ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మ కర్త మండలి సభ్యుడు అర్చకులు వాడపల్లి శేషాచార్యులు, ఖండవల్లి సీత రామ చార్యులు ఆధ్వర్యంలో నిర్వహించగా, వేద పండితులు వెంకట అవధాని భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభం కానున్నట్లు కార్యనిర్వాహణాధికారి బి.వెంకట రమణ మూర్తి తెలిపారు.

# జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయస్థాయి వెబినార్



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 5**: జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ దేవరపల్లి చెన్నారావు ఆధ్వర్యంలో వాణిజ్య విభాగం కృత్రిమ మేధస్సు ద్వారా వ్యాపారారంభ ప్రక్రియ వేగవంతీకరణ అనే అంశం పై ఒకరోజు జాతీయస్థాయి వెబినార్ ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి కళాశాల విద్యా కమిషనర్ డాక్టర్ కె. నారాయణ భరత్ గుప్తా ప్రధాన పోషకులుగా, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి కృష్ణ పోషకులుగా, రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి.వి. కృష్ణాజీ, సహ పోషకులుగా వ్యవహరించారు. వెబినార్లో ప్రముఖ వక్తలుగా ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం వాణిజ్య మరియు మేనేజ్ మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ ఎస్. ఉదయ భాస్కర్, గురు ఘాశిదాస్ విశ్వవిద్యాలయం వానిజ్య విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. వేంకటేశ్వర రావు, ఆంధ్ర విశ్వవిద్యాలయం వాణిజ్య మరియు మేనేజ్మెంట్ స్టడీస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. సుబ్బయ్య పాల్గొన్నారు.

ఏఐ అనేది మార్కెట్ ట్రెండ్స్ కస్టమర్ ఫీడ్ బ్యాక్ మరియు పరిశ్రమ డేటాను విశ్లేషించి ఇనోవేటివ్ బిజినెస్ ఐడియాలను సూచించగలదని తెలిపారు. అనంతరం ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం వాణిజ్య మరియు మేనేజ్ మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ ఎస్. ఉదయ భాస్కర్ గారు మాట్లాడుతూ ఏఐ ఆధారిత సాంకేతికతలు వ్యాపార ప్రపంచాన్ని వేగంగా మారుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్ కామర్స్ అధ్యాపకులు డాక్టర్ జి సురేష్, సెక్రటరీ పి.పద్మ శేఖర్ వ్యవహరించి విద్యార్థులకు ఈ అంశం పై అవగాహన కలిగించారు.

## జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 5:** జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకులు వానపల్లి గోపాలకృష్ణకు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేయడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవరపల్లి చెన్నారావు తెలిపారు. ఈయన ప్రొఫెసర్ కె.టి. రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో ఏ కాంప్రహెన్సివ్ స్టడీ ఆన్ బిస్మత్ సల్ఫైడ్ తిన్ ఫిలిమ్స్ సింథసైజ్డ్ వయా కెమికల్ బాత్ డిపోజిషన్ అండ్ సల్ఫరైజేషన్ ఫర్ ఫోటో వాల్టాయిక్ అప్లికేషన్స్ అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ఈయన రూపొందించిన పలు పరిశోధన పత్రాలు అంతర్జాతీయ జర్నల్స్ లో ప్రచురితం అయ్యాయి. పలు అంతర్జాతీయ, జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలను సమర్పించారు. ఒకవైపు కళాశాలలో భౌతిక శాస్త్రం భోధిస్తూ, మరొకవైపు పరిశోధన చేసి డాక్టరేట్ పొందటం అభినందనీయమని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సంధర్భంగా అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

# మందపల్లిలో తైలాభిషేక మండప నిర్మాణానికి శంకుస్థాపన మార్కింగ్



**కొత్తపేట,పెన్ పవర్,మార్చి05;**కోత్తపేట మండలం మందపల్లి గ్రామంలో వెలసియున్న శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానంలో తైలాభిషేక మండప నిర్మాణానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి.గురువారం మందపల్లి విచ్చేసిన దేవాదాయ శాఖ కాకినాడ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో, ఆలయ ఈ.వో డి సురేష్ బాబు సూచనలు అనుసరించి 2027 పుష్కర నిధుల నుండి మంజూరైన నిధులతో ఈ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

శంకుస్థాపన కార్యక్రమం నిమిత్తం ఆలయ ప్రాంగణంలో అధికారులచే మార్కింగ్ ఇవ్వబడింది. భక్తులు తైలాభిషేకాలు సౌకర్యవంతంగా నిర్వహించుకునే విధంగా ప్రత్యేక మండపం నిర్మించాలని దేవాదాయ శాఖ నిర్ణయించింది.డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ, పుష్కర నిధులతో చేపడుతున్న ఈ నిర్మాణం ఆలయ అభివృద్ధికి దోహదపడుతుందని, పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నిర్మాణంతో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందనున్నాయి.

# ఉపాది హామీ అనుసంధానంతో జిల్లాలో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

జాయింట్ కమీషనర్ జె. సునీత




**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 5;**ఉపాది హామీ అనుసంధానంతో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్ జి ఎన్ ఆర్ఈజిఎస్ జాయింట్ కమీషనర్ జె. సునీత సూచించారు.

డా. బి.ఆర్ .అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ గోదావరి భవన్ నందు గురువారం పంచాయితీ రాజ్ డ్వామా సిబ్బంది తో సమావేశం నిర్వహించారు. , ఈ సమావేశంలో కన్వర్జెన్సీ , బి.గోపీచంద్ – చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారులతో సమీక్షా సమావేశము నిర్వహించారు.

ఉపాది హామీ అనుసంధానంతో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి నరేగా పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు, సిబ్బందికి ఆదేశములు జారీ చేసారు. జిల్లాలో వున్న 385 పంచాయతీల్లో అనుసంధానంతో చేపట్టిన అభివృద్ధి మెటీరియల్ కాంపోనెంట్ పనుల పురోగతిపై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ రూ 48. 21 కోట్ల మెటీరీయల్ కాంపోనెంట్ నిధులతో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మార్చి 15 వతేదీ లోపు పూర్తిచేసి బిల్లులు ఆన్లైన్ చేయాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో 20 పనులకు మాత్రమే అనుమతి వున్నదని యిందులో ఉద్యాన వన పనులు , గృహ నిర్మాణ పనులకు మినహాయింపు వున్నదని తెలియజేశారు. జాబ్ కార్డ్ నమోదు చేసుకున్న ప్రతీ ఉపాది వేతనదారునకు ఈ–కెవైసి తప్పని సరిగా చేయించాలి. ఆలాగే పనులకు హాజరయిన వేతనదారుల అటెండెన్స్ ఈనెల 1 నుండి ఎఫ్ఆర్ఎస్ ముఖ ఆదారిత హాజరు తప్పని సరి అయ్యింది కనుక హాజరు పంపే సమయంలో జాగ్రత్త వహించాలని 22 మండలముల ఏ.పి.ఓ ల వారికి ఆదేశములు జారీ చేసారు. సాంకేతిక సమస్య లపై సమీక్షించారు. పేదలకు ఉపాది కల్పించడంతోపాటు గ్రామాల్లో సుస్థిర ఆస్తులను సృష్టించేలా ఏప్రిల్ నుండి అమలులోకి రాబోతున్న వికసిత్ భారత్ జీ రాంజీ పథకాన్ని నరేగా మాదిరిగా ప్రగతి పదంలో తీసుకువెళ్లాలని తెలియజేశారు. . ఈ సమావేశంలో డ్వామా పీడీ ఎస్ మధుసూదన రావు మరియు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఎస్.ఇ ,రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. సమీక్షా సమావేశంనందు పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ డిఈలు, ఏఈలు,ఏపిడిలు, ఏ.పి.ఓలు హాజరైనారు.

# డిజిటల్ వ్యవస్థ భావిత రాలకు వివాదరహిత భూములను అందిస్తుంది

-జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 5:** ప్రజలకు భూ పరిపాలన ద్వారా డిజిటల్ వ్యవస్థ రూపొందించి భావిత రాలకు వివాదరహిత భూములను అందిస్తూ సుపరిపాలన దిశగా ముందడుగు వేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి రెవెన్యూ అధికా రులు ఆదేశించారు జిల్లా కలెక్ట రేట్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ అధ్యక్ష తన రెవెన్యూ సంబంధిత అంశాలపై సమీక్ష సమావేశం నిర్వ హించారు ఈ సందర్భంగా ముఖ్యంగా 22–ఏ భూములు, భూ రీ–సర్వే, పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ మ్యుటేష న్స్ వంటి అంశాల పురోగతి పై అధికారులతో చర్చించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు వేగవంతంగా, పారదర్శకం గా అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేకంగా 22–ఏ భూములకు సంబంధించిన సమస్యల ను త్వరితగతిన పరిష్క రించేందుకు తహశీల్దార్లు అంకితభావం చిత్తశు ద్ధితో పనిచేయాలన్నారు. భూములకు సంబంధించిన కేసులను సమగ్రంగా పరి శీలించి, నిబంధనలకు అనుగుణంగా త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు ప్రజలకు అనవసర జాప్యాలకు తావు లేకుండా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో కొనసాగుతున్న భూ రీ–సర్వే పనులు ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం లక్ష్యాలు చేరు కోవాలన్నారు భూ రీ–సర్వే ప్రక్రియలో భూ యాజమాన్యాలను భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై కూడా ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశిత గడువులోగా పరిష్కరిస్తూ పెం డింగ్ ఉంచరాదన్నారు ప్రజలు నమోదు చేస్తున్న ఫిర్యాదులను నిర్దేశిత గడువులోపు పరిష్కరించి వారికి సంతృప్తికరమైన సేవలు అందించాలని సూచించారు. మ్యుటేషన్స్ దరఖాస్తులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని, పెండిం గ్‌లో ఉన్న కేసులను తగ్గించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచిం చారు. భూపరిపాలనను ఆధునీక రించడానికి , భూ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించడానికి చేపట్టిన రెవెన్యూ క్లినిక్, రీ–సర్వే, , రికార్డుల స్వచ్ఛీకరణ ప్రక్రియల ద్వారా జిల్లాలో భూ పరిపాలిత సుపరి పాలన అందించాలన్నారు

దశాబ్దాల తర్వాత అత్యా ధునిక సాంకేతికతతో చేప ట్టిన ఈ రీ–సర్వే కార్యక్రమం భూ రికార్డుల డిజిటలైజేష న్‌లో కీలక పాత్ర పోషిస్తోందన్నారు డ్రోన్లు, మరియు రోవర్లను ఉపయోగించి ఖచ్చితత్వంతో సర్వే నిర్వహించాలన్నారు.

మొదటి దశలో వేల గ్రామా ల్లో సర్వే పూర్తయి, తుదిరికార్డులు సిద్ధపరిచారన్నారు. రీ సర్వే అనంతరం భూమి యజమా నులకు క్యూఆర్ కోడ్ ఉన్న పింక్ పట్టాదార్ పాస్ పుస్తకా లను ప్రతి నెల రెండో తేదీ నుండి 9వ తేదీ వరకు పంపిణీ చేయడం జరు గుతోశీదన్నారు. రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణ రీ–సర్వేకు ముందు సర్వే సమయం లో రికార్డుల్లో ఉన్న తప్పులను సరిదిద్దడం స్వచ్ఛకరణ ప్రధాన ఉద్దేశం అన్నారు పాత రికార్డులకు, క్షేత్రస్థా యిలో ఉన్న సాగుకు మధ్యగల వ్యత్యాసాలను సరిచేయడం జరుగుతుం దన్నారు.ప్రొహిబిటెడ్ ప్రాపర్టీస్ 22 ఏ నిషేధిత జాబితాలో పొరపాటున చేరిన పట్టా భూములను తొలగించి, రైతులకు పూర్తి హక్కులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న భూములను వారసత్వ మార్పిడి, రిజిస్ట్రేషన్ మ్యుటేషన్లను వేగంగా పూర్తి చేయాలన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థలో భాగంగా రైతుల భూ సమస్యలను స్థానికంగానే పరిష్కరించడానికి రెవెన్యూ క్లినిక్“లను ఏర్పాటు చేశారన్నారు

గ్రామంలోనే విలేజ్ సర్వేయర్ మరియు విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ అందుబాటులో ఉండి అర్జీలను స్వీకరిస్తారన్నారు రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పారదర్శకంగా సమస్యల పరిష్కారం లభిస్తోందన్నా రుడిజిటల్ సేవలు అడం గల్, 1–బి నకళ్లు మరియు మ్యాపులను సచివాలయాల నుంచే పొందే వెసులుబాటు కలిగిందన్నారు. డిజిటల్ రెవెన్యూ రికార్డుల నిర్వహణ

ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా కాగిత రహిత దిశగా తీసుకెళ్తోంద న్నారు డిజిటల్ సంతకంతో భూ రికార్డులు భద్ర పరచడం జరిగిందన్నారు ప్రతి భూ కమతానికి ల్యాండ్ పార్సిల్ 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించడం జరుగుతుంద న్నారు సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాలను గ్రామ సచివాలయాలతో అను సంధానించి, సర్వే నంబర్ ఆధారిత రిజిస్ట్రేషన్లు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ ప్రక్రియ ద్వారా భూ వివాదాలు తగ్గడమే కాకుండా, భూమికి పూర్తి భద్రత లభిస్తోందన్నారు ప్రస్తుతం మిగిలిన గ్రామా ల్లో డ్రోన్ సర్వేను వేగవంతం చేయడం డేటా ఎంట్రీలో తప్పులు దొర్ల కుండా క్వాలిటీ చెక్ నిర్వహించడంపై అధికా రులు దృష్టి సారించారు.

# వాడపల్లి వెంకన్న సన్నిధికి భక్తుల రద్దీ నిత్య అన్నదానానికి విరాళం




**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 5 :**కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి క్షేత్రానికి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి నిలువెత్తు దర్శనం చేసుకుంటున్నారు. ఏడు వారాల వెంకన్నగా ప్రసిద్ధిగాంచిన ఈ క్షేత్రానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు విచ్చేసి స్వామివారికి ఏడు వారాల నోము నిర్వహిస్తున్నారు.గురువారం స్వామివారి సన్నిధిలో విశిష్ట పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

స్వామివారి సన్నిధిలో నిర్వహించే నిత్య అన్నదాన కార్యక్రమానికి వాడపల్లి గ్రామానికి చెందిన సరిదే భాను వారి కుటుంబ సభ్యులు రూ.50,116లను విరాళంగా సమర్పించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేయగా, ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్యచక్రధరరావు దాతలను స్వామివారి చిత్రపటంతో సత్కరించారు.

## శ్రీ సత్తెమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపైనా మెండుగా ఉండాలి.






-వైసీపీ నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్ మార్చి 05**: శ్రీ సత్తెమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరి పైనా మెండుగా ఉండాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైసీపీ నాయకులు, నరసాపురం పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు.

పత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామంలో శ్రీ సత్తెమ్మతల్లి అమ్మవారి మహోత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి దర్శనం చేసుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమానికి 10,000 రూపాయలు విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంట గంగబాబు,తోలేటి శేఖర్,ముమ్మిడి వీరబాబు,గంట లచ్చబాబు (బుజ్జి ),సుంకర తమ్మారావు,గంట చిట్టిబాబు,శైలు నాగేశ్వరరావు,నార్లంక చక్రరావు,నార్లంక వెంకన్నబాబు,అర్జంపూడి రాంబాబు,కొప్పన సత్తిబాబు,చెవల వెంకన్న,గంట పండు గారు,కోలుమాటి చిన్ని,షేక్ సత్తిబాబు,ఎంపీటీసీ నానిపల్లి చంటి,కోలా తాతబాబు,కోలా సూరిబాబు,దాడి పుత్తయ్య ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# అదిత్య విశ్వవిద్యాలయం లో ఉత్సాహంగా 'థండర్ థర్స్‌డే'






**గండేపల్లి, పెన్ పవర్, మార్చి,5:**గండేపల్లి మండలం సూరంపాలెం : గురువారం అదిత్య విశ్వవిద్యాలయంలో స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ (ఎస్.ఏ.సి) ఆధ్వర్యంలో, అభినయ క్లబ్ నిర్వహిస్తున్న 'థండర్ థర్స్‌డే' మహిళా దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం ఎంతగానో అలరించింది. ఈ సందర్భంగా డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. మేడపాటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఈ 'థండర్ థర్స్‌డే' కార్యక్రమం విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి ఒక అద్భుతమైన వేదికగా నిలుస్తోంది అని అన్నారు. ప్రతివారం నిర్వహించే ఈ కార్యక్రమం విద్యార్థుల సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, సాంస్కృతిక వ్యక్తీకరణ వేడుకలా మారింది.థండర్ థర్స్‌డే వేదికపై విద్యార్థులు పాటలు, నృత్యం, నాటకం, కవిత్వం, కథనాలు, మిమిక్రీ, స్టాండ్-అప్ కామెడీ, యాంకరింగ్, కళలు లేదా తాము కలిగిన ఏదైనా ప్రత్యేక ప్రతిభను స్వేచ్ఛగా ప్రదర్శించవచ్చు. "ప్రతిభకు పరిమితులు ఉండవు" అన్న ఆలోచనతో ఈ వేదిక విద్యార్థులను ముందుకు నడిపిస్తుంది.ఈ కార్యక్రమం విద్యార్థులలో స్టేజ్ భయాన్ని తొలగించి, ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. వివిధ విభాగాల విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకోవడం ద్వారా స్నేహభావం, సమన్వయం, సాంస్కృతిక వైవిధ్యం పెరుగుతుంది.అభినయ క్లబ్ ఈ కార్యక్రమాన్ని అత్యంత నిబద్ధతతో నిర్వహిస్తోంది. ఈ క్లబ్ కోఆర్డినేటర్ డా. నీలిమ సమర్థవంతమైన నాయకత్వం లో విజయవంతంగా నిర్వహిస్తూ సోషల్ మీడియా ను సైతం షేక్ చేస్తుంది అనడంలో సందేహం లేదు. ఈ కార్యక్రమంలో డీన్. డా. డి. కిషోర్, అభిలాష్, సుమ, సుగంధి వివిధ విభాగాల అధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.








## కిర్లంపూడి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గా గౌతు చిన్న



**కిర్లంపూడి, పెన్ పవర్, మార్చి 05:** మండల కేంద్రమైన కిర్లంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ చైర్మన్ గా కిర్లంపూడి గ్రామానికి చెందినగౌతు చిన్న నియమితులయ్యారు. దీంతో గౌతు చిన్న ను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్థానిక వైద్యాధికారులు బి రాంబాబు నాయక్, సాయి హేమాంజలి ఆసుపత్రి సిబ్బంది తోపాటు కిర్లంపూడి సొసైటీ చైర్మన్ కుర్ల చినబాబు, టిడిపి నాయకులు తూము కుమార్, చదరం చంటిబాబు కాళ్ళ వెంకటేష్,గుడాల రాంబాబు తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా గౌతు చిన్న మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గా నియమించిన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ,జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ లకు కృతజ్ఞతలు తెలియజేసారు.ద

# మందపల్లి మందేశ్వరస్వామి దేవస్థానంలో మహిళా ధర్మకర్త ఖాళీకి దరఖాస్తుల ఆహ్వానం

**కొత్తపేట,పెన్ పవర్, మార్చ్ 05;**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో ఉన్న శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థాన ధర్మకర్తల మండలిలో మహిళా వర్గానికి చెందిన ఒక ధర్మకర్త స్థానం ఖాళీగా ఉన్న నేపథ్యంలో దానిని భర్తీ చేయుటకు దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రకటన విడుదల చేసింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జి.ఓ.ఎం.ఎస్. నెం.242, రెవిన్యూ (ఎండోమెంట్స్-××) శాఖ, తేదీ 12-02-2026, దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్, విజయవాడ వారి ఆదేశాలతో హిందూ ధర్మాదాయ చట్టం 30/1987, తదుపరి సవరణల ప్రకారం నియామక ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు.ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఫారం-×× ప్రకారం దరఖాస్తులను నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నుండి 20 రోజుల్లోగా కార్యాలయానికి పంపవలసిందిగా కోరారు.ఈ మేరకు ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ ,చైర్మన్ పూసపాటి అశోకగజపతి రాజు, ధర్మకర్తల మండలి సభ్యులు,సహాయ కమిషనర్-కార్యనిర్వహణాధికారి డి. సురేష్ బాబు తెలిపారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

**ఈ నెల 13 నుండి 24 వరకు కాకినాడలో భారీ డ్వాక్రా ఎగ్జిబిషన్**

**కాకినాడ, పెన్ పవర్, మార్చి 5:**జిల్లా, నియోజకవర్గ స్థాయిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్ కోర్టు హాలులో డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి మార్చి 8న జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల నిర్వహణపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు "వేగవంతమైన కార్యాచరణ మహిళలు, పిల్లలు అందరికీ హక్కులు, సమానత్వం, సాధికారిత" అనే నినాదంతో ప్రపంచవ్యాప్తంగా నిర్వహించ బడుతున్నాయని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న లక్షమంది మహిళలను ఎంటర్‌ప్రెన్యూర్లుగా తీర్చిదిద్దే కార్యక్రమంలో కాకినాడ జిల్లాకు చెందిన సుమారు 4 వేల మంది మహిళలు ఉన్నారని పేర్కొన్నారు.వీరందరి విజయాలను రాష్ట్ర,జిల్లా, నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే మహిళా దినోత్సవ వేడుకల్లో అభినందించనున్నట్లు తెలిపారు. మహిళల విద్య, ఆరోగ్యం, రక్షణ, సాధికారత వంటి అభివృద్ధి సూచికల్లో సాధించిన పురోగతిని కూడా ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలకు తెలియజేయాలని సూచించారు.ఎంఎస్ఎంఈ యూనిట్లు, స్టార్టప్‌ల ద్వారా ముందుకు వస్తున్న మహిళలు, క్రీడలు, కళల రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలు, శక్తి యాప్ లబ్ధిదారులు ఈ వేడుకల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.మార్చి 8న ఉదయం 11.30 గంటలకు రాష్ట్ర స్థాయిలో జరిగే మహిళా దినోత్సవ కార్యక్రమాలను లైవ్ ప్రసారం ద్వారా జిల్లా, నియోజకవర్గ స్థాయిలో కూడా ఒకేసారి నిర్వహించాలని సూచించారు. అలాగే వివిధ రంగాల్లో విజయపథంలో సాగుతున్న మహిళల అనుభవాలను ఇతరులతో పంచుకునేలా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వేడుకల సందర్భంగా ఎస్‌హెచ్‌జీ బ్రాండ్, లోగో ఆవిష్కరణ, గ్రూపులకు బ్యాంకు రుణాల లింకేజీ చెక్కుల పంపిణీ, మహిళా అభ్యున్నతికి జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాల ప్రకటన వంటి కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర స్థాయి వేడుకల్లో పాల్గొనే మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక బస్సు రవాణా, భోజన ఏర్పాట్లు చేయాలని కూడా సూచించారు.

13 నుండి 24 వరకు కాకినాడలో డ్వాక్రా ఎగ్జిబిషన్

జిల్లా కేంద్రం కాకినాడలోని ప్రభుత్వ ఐటీఐ మైదానంలో మార్చి 13 నుండి 24 వరకు 120 స్టాళ్లతో స్వయం సహాయ బృందాల ఉత్పత్తులతో భారీ డ్వాక్రా ఎగ్జిబిషన్ నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇందులో 50 స్టాళ్లను రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు చెందిన డ్వాక్రా సంఘాలకు కేటాయించాలని సూచించారు.ఎగ్జిబిషన్‌లో పాల్గొనే మహిళా బృందాలకు తగిన భోజన, వసతి సదుపాయాలు కల్పించాలని డీఆర్‌డీఏ పీడీకి సూచించారు. ఎగ్జిబిషన్ స్థలంలో బుష్ క్లియరెన్స్, గ్రౌండ్ లెవెలింగ్, తాగునీరు, పారిశుద్యం, మరుగుదొడ్లు, ప్రచార హోర్డింగులు తదితర ఏర్పాట్లు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.పోలీస్ శాఖ ద్వారా శాంతి భద్రతలు, అగ్నిమాపక శాఖ ద్వారా ఫైర్ సేఫ్టీ, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా మెడికల్ క్యాంప్ మరియు ఫస్ట్ ఎయిడ్, విద్యుత్ శాఖ ద్వారా అంతరాయం లేని విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎగ్జిబిషన్ నిర్వహణకు అవసరమైన నిధుల సమీకరణ, సిఎస్ఆర్ స్పాన్సర్ అంశాలను ముఖ్య ప్రణాళికా ధికారి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్‌లు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ సీహెచ్ లక్ష్మి, జడ్పీ సీఈఓ వీవీవీఎస్ లక్ష్మణరావు, సీపీఓ పి. త్రినాథ్, ఎల్డిఎ సుబ్రమణ్యం, డ్వామా పీడీ పి. వెంకటలక్ష్మి, కాకినాడ ఆర్డీవో ఎస్. మల్లిబాబు, పెద్దాపురం ఆర్డీవో ఎన్. శ్రీధర్, కాకినాడ ఏడీసీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధికి నూతన సంకల్పంతో, ఉపాధికి కొత్త హామీ

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వికసిత్ భారత్**



**కాకినాడ, మార్చి 05, పెన్ పవర్:**జి రామ్ జి పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రచురించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి గురువారం కలెక్టరేట్ కోర్టు హాలులో ఆవిష్కరించారు.వికసిత్ భారత్ జి రామ్ జి పథకం ద్వారా కల్పిస్తున్న 125 రోజుల ఉపాధి హామీ, నిరుద్యోగ భృతి కోసం మెరుగైన ఏర్పాట్లు, సమయానికి కూలీ చెల్లింపు, ఆలస్యమైన చెల్లింపులకు పరిహారం, గ్రామ సభల ద్వారా వికసిత గ్రామ పంచాయితీ ప్రణాళికల అంశాలతో ఈ గోడ పత్రికను ప్రచురించినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ పి. వెంకటలక్ష్మి, సీపీఓ పి. త్రినాద్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, కాకినాడ ఆర్డీవో ఎస్. మల్లిబాబు, పెద్దాపురం ఆర్డీవో ఎన్. శ్రీధర్, జడ్పీ సీఈఓ వీవీవీఎస్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


# జనాభా గణనపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం



**కాకినాడ, పెన్ పవర్,మార్చి 05:**
భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న 16వ జనాభా గణన ప్రక్రియకు సంబంధించి జిల్లాస్థాయిలో ఈ నెల 6 నుండి 8వ తేదీ వరకు మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు.కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో ఈ శిక్షణ కార్యక్రమం ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధిత అధికారులు తమ ల్యాప్‌టాప్‌లతో తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.జనాభా గణనలో మొదటి దశగా నిర్వహించే గృహాల జాబితా తయారీ మరియు గృహ వసతుల గణనకు సంబంధించి అధికారులకు శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు.

మీకు కావాలంటే దీనికి పేపర్‌కు సరిపోయేలా 23 ఆకర్షణీయమైన హెడ్‌లైన్లు కూడా తయారు చేసి ఇవ్వగలను.

# పరిశ్రమల్లో అత్యవసర పరిస్థితులపై మాక్ డ్రిల్స్ నిర్వహణ





**కాకినాడ / పెద్దాపురం, మార్చి 05, పెన్ పవర్:**డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆధ్వర్యంలో గురువారం పెద్దాపురం ప్రాంతంలోని పలు పరిశ్రమల్లో అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు మాక్ డ్రిల్స్ నిర్వహించారు.పెద్దాపురంలోని కేబీకే బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, హుస్సేన్‌పురం గ్రామంలోని వెంకటరమణ ఆయిల్స్, పెద్దాపురంలోని రాక్ సిరామిక్స్, అలాగే అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమల్లో ఈ మాక్ డ్రిల్స్ నిర్వహించబడినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఆయా పరిశ్రమల్లో ఆన్‌సైట్ ఎమర్జెన్సీ సిద్ధతను అధికారులు పరిశీలించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు అనుసరించాల్సిన విధానాలను కార్మికులకు వివరించారు.ఈ కార్యక్రమంలో జీఎండీఐసీ సీహెచ్. గణపతి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.వి.వి.ఎస్. నారాయణ, కాలుష్య నియంత్రణ మండలి ఏఈఈ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.వి.వి.ఎస్. నారాయణ మాట్లాడుతూ పరిశ్రమల్లో జరిగే ప్రమాదాలపై కార్మికులకు అవగాహన కల్పించేందుకు తరచూ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని పేర్కొన్నారు.అలాగే పనుల స్వభావానికి అనుగుణంగా కార్మికులకు అవసరమైన వ్యక్తిగత రక్షణ పరికరాలు (పీపీఈ పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్మెంట్) అందించాలని, ప్రమాదకర కార్యకలాపాలను అనుభవం కలిగిన వ్యక్తుల పర్యవేక్షణలోనే నిర్వహించాలని సూచించారు. పరిశ్రమల్లో భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని ఆయన తెలిపారు.

# ఇంగ్లాండ్‌పై భారత్ గెలవడం కష్టం.. పాక్ మాజీ క్రికెటర్ బోల్డ్ ప్రెడిక్షన్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా జరిగే సెమీఫైనల్ మ్యాచ్‌లో ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ జట్లు తలపడనున్నాయి. ముంబైలోని వాంఖెడే స్టేడియంలో జరగనున్న ఈ కీలక మ్యాచ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కాగా, ఇప్పటికే సూపర్---8 దశలోనే టోర్నమెంట్ నుంచి నిష్క్రమించిన పాకిస్థాన్ జట్టు.. ఆ దేశ మాజీ క్రికెటర్లు మాత్రం ఈ మ్యాచ్‌పై పిచ్చి కూతలు కూస్తున్నారు. మాజీ పాకిస్థాన్ కెప్టెన్ రషీద్ లతీఫ్ 'హార్నా మనా హై' అనే కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఇంగ్లాండ్ జట్టుకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నాడు. ఎందుకంటే, కఠినమైన పరిస్థితుల్లోనూ వారు బాగా ఆడుతున్నారు.. ఆ జట్టులో ఇద్దరు లేదా ముగ్గురు బ్యాటర్లు ఫామ్‌లో ఉన్నారు.. ముఖ్యంగా మిడిల్ ఆర్డర్ చాలా బలంగా ఉందని కామెంట్స్ చేశాడు.

వాంఖెడే మైదానంలో పరిస్థితులు కూడా ఇంగ్లాండ్‌కు అనుకూలంగా ఉండొచ్చని రషీద్ లతిఫ్ పేర్కొన్నారు. ఇంగ్లాండ్ ఆటగాళ్లలో ఒక్కరు మంచి ప్రదర్శన చేసినా భారత్ ఓడిపోవడం పక్కా అని వ్యాఖ్యానించాడు. ఈ టోర్నీ ప్రారంభంలో ఇంగ్లాండ్ జట్టు ఆశించిన విధంగా ప్రదర్శన చేయలేక పోయింది.. అయినప్పటికీ క్రమంగా పుంజుకుని సెమీఫైనల్‌కు చేరుకుంది అన్నాడు. గ్రూప్ దశలో నేపాల్, ఇటలీపై కష్టపడి గెలవగా, వెస్టిండీస్ చేతిలో ఘోరంగా ఓడిపోయింది. సూపర్-8 దశలో మాత్రం శ్రీలంక, పాకిస్థాన్, న్యూజిలాండ్ జట్లపై అద్భుతంగా ఆడిన ఇంగ్లాండ్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది.

ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ కూడా ఈ మ్యాచ్‌పై నమ్మకం వ్యక్తం చేశాడు. క్లోజ్ మ్యాచ్‌లలో కూడా గెలవడం మాకు అలవాటు.. ఆటలో ఎప్పుడూ నిరాశ చెందొద్దు అని నేను నేర్చుకున్నాను.. మా ప్లేయర్స్ లో గెలవాలనే తపన ఉంది.. ఒత్తిడిలో కూడా ప్రశాంతంగా ఆడగల సామర్థ్యం మాకు ఉందని వెల్లడించాడు.

భారత్‌తో మ్యాచ్ ఆడాలని మా జట్టులో చాలా మంది ముందే కోరుకున్నారు.. ఇది చాలా పెద్ద మ్యాచ్.. ఇరు జట్లపై కూడా ఒత్తిడి ఉంటుంది.. ఇండియన్స్ కి వారి అభిమానుల నుంచి మద్దతు ఉంటుంది.. వాంఖడే స్టేడియం మొత్తం సూర్య సేనకు సపోర్టు చేస్తుంది.. అయినప్పటికీ మేము మా ఆటను ప్రదర్శించాలని ఆశిస్తున్నాం.. జోస్ బట్లర్, ఫిల్ సాల్ట్ ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారని బ్రూక్ పేర్కొన్నాడు.

# నేను ఇంటికి పోతా.. మమ్మల్ని పంపించండి: కోల్‌కతాలో చిక్కుకున్న డారెన్ సామీ ఆవేదన

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం వల్ల మిడిల్ ఈస్ట్?లో విమాన రాకపోకలు స్తంభించిపోయాయి. టీ20 వరల్డ్ కప్ ఆడేందుకు ఇండియాకు వచ్చిన వెస్టిండీస్ క్రికెట్ జట్టు మిడిల్ ఈస్ట్?లో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఐదు రోజులుగా కోల్?కతాలోనే చిక్కుకుపోయింది. ఈ క్రమంలో వెస్టిండీస్ హెడ్ కోచ్ డారెన్ సామీ తీవ్ర విచారం వ్యక్తం చేశాడు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ట్వీట్ చేసిన సామీ.. తనకు ఇంటికి వెళ్లాలనుందని పేర్కొన్నాడు. అసలు ఏం జరుగుతుందో మాకు ఏదైనా అప్డేట్ ఇవ్వండి.. ఇవాళా, రేపా లేక ఇంకో వారమా ఎప్పుడూ వెళ్తామో చెప్పండని కోరాడు. ఇప్పటికే ఐదు రోజులు అవుతోందని ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా, టీ20 వరల్డ్ కప్ నుంచి వెస్టిండీస్ నిష్క్రమించిన విషయం తెలిసిందే. ఈడెన్ గార్డెన్స్ వేదికగా సూపర్ 8 రౌండ్?లో భాగంగా ఇండియాతో జరిగిన డూ ఆర్ డై మ్యాచ్‌లో వెస్టిండీస్ ఓటమి పాలై ఇంటి దారి పట్టింది. కరేబియన్ జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించినప్పటికీ ఐదు రోజులుగా ఇక్కడే చిక్కుకుపోయారు.

మిడిల్ ఈస్ట్‌లో యుద్ధ పరిస్థితుల వల్ల విమాన రాకపోకలపై ఆంక్షలు కొనసాగుతున్నాయి. దీంతో వెస్టిండీస్ ప్లేయర్ తమ సొంత దేశం వెళ్లేందుకు వీలు లేకుండాపోయింది. ఇదిలా



ఉండగా.. వెస్టిండీస్ క్రికెటర్స్ ను సొంత దేశానికి తరలించేందుకు ఐసీసీ చర్యలు చేపట్టినట్లు జురాచీఏతీఱఎఱఅటశీ నివేదించింది. కోల్‌కతా నుంచి లండన్ మీదుగా కరేబియన్ దీవులకు వెళ్లేలా చార్టర్డ్ ఫ్లైట్ ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో వెస్టిండీస్ క్రికెటర్స్ తమ స్వస్థలాలకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

# అభిషేక్ శర్మ చెలరేగితే ఇండియాను ఆపే టోడే లేడు.. కానీ!

**హైదరాబాద్ పెన్ పవర్:** 20 ప్రపంచ కప్ 2026 రెండో సెమీఫైనల్ మ్యాచ్ ఈరోజు ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ జట్ల మధ్య జరగనుంది. ఈ మ్యాచ్ లో గెలిచిన జట్టు ఇప్పటికే ఫైనల్ కి వెళ్లిన న్యూజిలాండ్ జట్టుతో తలపడనుంది. మొదటి సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాపై తొమ్మిది వికెట్ల తేడాతో న్యూజిలాండ్ విజయం సాధించింది. కాగా, రెండో సెమీఫైనల్‌లో భారత్ బలమైన ప్రదర్శన చేసి ఫైనల్ ఫైట్ కి అర్హత సాధించాలని చూస్తుంది. ఇందులో భాగంగా



టీమిండియా ఓపెనర్లు తమ ప్రదర్శనను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉంది. అయితే వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ మాత్రం వెస్టిండీస్ తో జరిగిన మ్యాచ్ తో ఫామ్‌లోకి వచ్చాడు.

**ముంబై ఇండియన్స్ బ్రిగేడ్‌పై ఆశలు:**

భారత జట్టులో ఉన్న ముంబై ఇండియన్స్ ప్లేయర్స్ ఈ మ్యాచ్‌లో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. ఇషాన్ కిషన్ టోర్నమెంట్ ప్రారంభంలో అద్భుతంగా ఆడినా ఇటీవల ఫామ్ కోల్పోయినట్లు కనిపిస్తుంది. గతంలో ముంబై ఇండియన్స్ జట్టు తరపున ఐపీఎల్ లో అనేక మ్యాచ్ లు ఆడిన అనుభవం ఉండటంతో.. వాంఖెడేలో తిరిగి మంచి ఇన్నింగ్స్ ఆడాలని చూస్తున్నాడు. అలాగే కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా వాంఖడేలో రాణించాలని అభిమానుల గంపెడు ఆశలు పెట్టుకున్నారు.

**అభిషేక్ శర్మ ఫామ్:**

టీ20 వరల్డ్ కప్ 2026 టోర్నమెంట్ ప్రారంభానికి ముందు అద్భుతమైన ఫామ్‌లో ఉన్న అభిషేక్ శర్మ ఈ పొట్టి వరల్డ్ కప్‌లో మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. సూపర్-8 దశలో జింబాబ్వేపై హాఫ్ సెంచరీ చేసినా తన అసలు దూకుడు ఇప్పటి వరకు ఇంకా కనిపించలేదు. ఈ సెమీఫైనల్‌లో పెద్ద ఇన్నింగ్స్ ఆడాల్సిన అవసరం ఉంది. ఒకవేళా ఈ సెమీస్ లో అతడు గానీ చెలరేగితే ఏ ఇంగ్లాండ్ బౌలర్ కూడా అభిషేక్ ని ఔట్ చేసే సహాసం చేయరు అని క్రీడా పండితులు పేర్కొంటున్నారు.

**శాంసన్ అద్భుత ఫామ్:**

ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌కు ముందు స్టార్ ఓపెనర్ సంజు శాంసన్ పూర్తి స్థాయిలో ఆత్మ విశ్వాసంతో బరిలోకి దిగుతున్నాడు. వెస్టిండీస్‌పై జరిగిన కీలక మ్యాచ్‌లో అతను అజేయంగా 97 పరుగులతో నాటౌట్ గా నిలిచి, భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. దాదాపు 10 సంవత్సరాల తర్వాత అంతర్జాతీయ వేదికపై సంజు కెరీర్‌లో ఇదే అత్యుత్తమ ప్రదర్శన అని చెప్పాలి.

**ఇంగ్లాండ్ బౌలర్ల సవాల్:**

ఇంగ్లాండ్ బౌలర్లు టీమిండియా ఓపెనర్లకు కఠిన పరీక్ష పెట్టే అవకాశం కనిపిస్తుంది. సీనియర్ స్పీడ్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ తన బౌన్సర్లతో సంజు శాంసన్‌ను ఇబ్బంది పెట్టే ఛాన్స్ ఉందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు ఆఫ్ స్పిన్‌తో విల్ జాక్స్ పవర్‌ప్లేలో మరింత ప్రభావం చూపించే అవకాశం ఉంది. అలాగే, మిడిల్ ఓవర్లలో ఇంగ్లాండ్ స్పిన్ దళం ఇండియన్ జట్టుకు పెద్ద సవాల్ గా మారనుంది. లెగ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ ఇప్పటి వరకు ఈ మెగా టోర్నమెంట్‌లో మొత్తం 11 వికెట్లు పడగొట్టగా, లెఫ్ట్ హ్యాండ్ స్పిన్నర్ లియామ్ డాసన్ 10 వికెట్లు తీసి అద్భుతమైన ఫామ్‌ని కనబరుస్తున్నాడు.

**వరుణ్ చక్రవర్తికి అగ్ని పరీక్ష:**

టీమిండియా మిస్టరీ స్పిన్ బౌలర్ వరుణ్ చక్రవర్తి ఈ టోర్నమెంట్‌లో ఇప్పటి వరకు స్థిరంగా రాణించలేకపోయాడు. సెమీఫైనల్‌లోనైనా అతను మెరుగైన ప్రదర్శన చేయాల్సిన అవసరం ఉంది. మరోవైపు, జస్ ప్రీత్ బుమ్రా మాత్రమే భారత జట్టు తరపున ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నప్పటకీ, హార్థిక్ పాండ్యా, అర్ష్ దీప్ సింగ్ వికెట్లు తీసుకుంటున్నప్పటికీ.. ధారళంగా పరుగులు సమర్పించుకుంటున్నారు.

# సెట్ లో అయినా, ఇంట్లో అయినా.. గౌరవం ఇవ్వాల్సిందే!

టాలీవుడ్‌లో మహిళా డైరెక్టర్ల సంఖ్య ఇంకా తక్కువగా ఉన్నప్పటికీ, నటి వరలక్ష్మి శరత్‌కుమార్ తనదైన ముద్ర వేయాలని డైరెక్టర్ గా కొత్త అడుగు వేస్తున్నారు. ఆమె దర్శకత్వంలో రూపొందిన సరస్వతి సినిమా మార్చి 6న రిలీజ్ కావడానికి సిద్దమవుతుంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ రాగా, ఈ చిత్ర ప్రమోషన్స్ లో వరూ యాక్టివ్ గా పాల్గొంటున్నారు.

**ఆ సినిమా నుంచి తప్పుకున్నా!**

అహం, ఆత్మగౌరవంలో తాను ఆత్మ గౌరవానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తానని, ఓ మలయాళ మూవీలో తనను తక్కువగా చూశారని ఆ సినిమా నుంచి తాను తప్పుకున్నట్టు ఆమె వెల్లడించారు. ఆ సినిమా హీరో, డైరెక్టర్ మంచి వాళ్లైనప్పటికీ, నిర్మాత తనతో వ్యవహరించిన తీరు



అనన్య నాగల్లా సొగసైన ఎంబ్రాయిడరీ చీరలో టైమ్‌లెస్ గ్రేస్‌ను ప్రసరిస్తుంది



నచ్చకపోవడంతో, హీరోకు కాల్ చేసి ఈ సినిమాను చేయడం లేదని చెప్పానని, అది అహంభావం కాదని, ఆత్మ గౌరవమని ఆమె తెలిపారు.

**అందరితో నిజాయితీగా ఉంటా!**

తాను అందరితో నిజాయితీగా ఉంటానని, తాను అందరినీ గౌరవిస్తానని, తనను కూడా అందరూ గౌరవించాలని కోరుకుంటానని, సెట్ లో అయినా, ఇంట్లో అయినా ఎక్కడైనా గౌరవం ఇవ్వాల్సిందేనని, లేదంటే అస్సలు సహించనని ఆమె పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తల్ని తాను పెద్దగా పట్టించుకోనని చెప్తున్న ఆమె, సోషల్ మీడియాలో వచ్చిన ఓ వార్తను చూసి తాను తెగ నవ్వుకున్నానని తెలిపారు.

**అదే ఉంటే ఇక్కడెందుకు ఉంటా?**

తన పెళ్లికి రూ.800 కోట్లు ఖర్చైందని సోషల్ మీడియాలో వార్తలొచ్చాయని, అంత డబ్బే తన దగ్గరుంటే అసలు ఇక్కడ ఎందుకు ఉంటానని అడిగారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా గురించి కూడా ఆమె మాట్లాడారు. సోషల్ మీడియా కాలక్షేపానికి పనికొస్తుందని, దానిపై ఎక్కువ టైమ్ వేస్ట్ చేయకుండా, క్రియేటివ్ గా ఆలోచిస్తే, అది కెరీర్ కు ఉపయోగపడుతుందని ఆమె చెప్పారు. ఫహద్ ఫాసిల్, ఆలియా భట్, మంజు వారియర్, దీపికా పదుకొణె ను తానెంతో అభిమానిస్తానని చెప్తున్న వరలక్ష్మి, నాంది మూవీలో ఆద్య క్యారెక్టర్ అంటే చాలా ఇష్టమని, అది యాక్టింగ్ పరంగా చాలా గొప్ప పాత్ర అని చెప్పుకొచ్చారు. సరస్వతి సినిమా అన్ని వర్గాల ఆడియన్స్ ను ఆకట్టుకుంటుందని, ఈ సినిమా తీసినందుకు తనకు గర్వంగా ఉందని ఆమె పేర్కొన్నారు.



కలర్‌ఫుల్ పోస్ట్‌ను షేర్ చేసింది అనసూయ

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com